'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 90 | ఆదివారం | 15.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 90 | Sunday | 15.11.2026 | Pages: 8 | Rate: 2



ఆసియా కప్ విజేత భారత్

పాక్‌పై చివరి బంతికి విజయం

పాక్ గుండెల్లో గుబులు.. భారత కుర్రాళ్లలో పట్టుదల.. ఆఖరి బంతికి ఉత్కంఠకు అంతులేని ఉర్రూతలు! అల్ అమరాత్ మైదానంలో అద్భుతం ఆవిష్కృతమైంది. ఆసియా కప్ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ నిర్దేశించిన 338 పరుగుల భారీ లక్ష్యం.. ఓ దశలో 252 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచిన భారత్.. ఇక కప్పు చేజారినట్టేనని భావించిన వేళ యువ సంచలనం మోహిత్ ఉల్వా విధ్వంసం సృష్టించాడు. (వివరాలు 3,8లో..)



తెలియని గన్‌మెన్ భయం... ఉగ్రవాదుల పరుగు!

సురక్షిత స్థావరాలకు హఫీజ్ సయీద్, మసూద్ తరలింపు

పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ రక్షణలో ఇద్దరు ఉగ్రవాదులు

భారత్‌పై ఉగ్రదాడులకు పాల్పడిన ఇద్దరు కీలక ఉగ్రవాదులు హఫీజ్ సయీద్, మసూద్ అజర్ ఇప్పుడు ప్రాణభయంతో వణికిపోతున్నట్లు నిఘా వర్గాల సమాచారం. గత వారం రోజులుగా వీరిద్దరినీ అత్యంత రహస్యంగా కొత్త ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఆధ్వర్యంలో భారీ భద్రత (వివరాలు 3లో..)



చైనా చిప్స్ పాలసీతో ట్రంప్‌కు లాభాల పంట!

ఎన్విడియా షేర్ల కొనుగోలు, లాభాలపై వివాదం

షేర్లలో పెట్టుబడి.. అవినీతి ఆరోపణలు

విధాన మార్పుకు ముందే షేర్ల కొనుగోలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న చైనా చిప్స్ విధాన నిర్ణయాలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. ఎన్విడియా సంస్థకు ప్రయోజనం చేకూర్చేలా విధానాలు మార్చకముందే ట్రంప్ ఆకంపెనీ షేర్లలో (వివరాలు 3లో..)



కాంగ్రెస్ పగ్గాలు సందీప్‌కు!

మీనాక్షి నటరాజన్‌కు ఉద్వాసన

తక్షణమే అమల్లోకి కొత్త నియామకం

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు చెందిన సీనియర్ నేత బి.ఎం. సందీప్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ స్థానంలో ఆయనకు అవకాశం కల్పిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నిర్ణయం తీసుకుంది. (వివరాలు 3లో..)



వెండితెరపై చెరగని ముద్ర

నటుడు గిరిబాబు అస్తమయం

విలన్‌గా భయపెట్టి.. హాస్యంతో నవ్వించి.. క్యారెక్టర్ నటుడిగా మెప్పించి.. ఐదు దశాబ్దాల పాటు తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన నటుడు గిరిబాబు ఇక లేరు. రావినూతల నుంచి వెండితెర వరకు సాగిన ఆయన సినీ ప్రస్థానానికి కన్నీటి వీడ్కోలు పలికింది. 80 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. (వివరాలు 3,8లో..)



బీజేపీ ఓటమి ఖాయం

- ప్రజల్లో మార్పు మొదలైంది • అధికారం నుంచి దించుతాం
- మోదీ, అమిత్ షాలో భయం కనిపిస్తోంది
- భారత్ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

ప్రధాని నరేంద్ర మోదీని ఓడించి అధికారంలో నుంచి దించడం ఇక ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ 2026లో ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, ప్రజల్లోనే కాకుండా ఢిల్లీలోనూ ఈ పరిణామాలు ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలో భయం కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. 2014 తర్వాత బీజేపీ రాజకీయ ఆధిపత్యాన్ని చూసి ప్రతిపక్షాలు దాదాపు పదేళ్లపాటు దిగ్భ్రాంతిలో ఉన్నాయని అంగీకరించారు. మీడియా, పత్రికలు, ఇంటర్వ్యూలు, బహిరంగ సభల ద్వారా ప్రజల్లోకి వెళ్లే సంప్రదాయ మార్గాలు పనిచేయడం లేదని గుర్తించామని చెప్పారు. చివరకు ప్రజలతో నేరుగా మమేకం కావడమే ప్రత్యామ్నాయమని నిర్ణయించుకున్నట్లు వివరించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగిన భారత్ జోడో యాత్ర కాంగ్రెస్ ప్రతిదాడికి పునాదిగా నిలిచిందని, వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి వల్లే ప్రజలతో అనుబంధం బలపడిందని పేర్కొన్నారు. (వివరాలు 2లో..)



యువతి స్కూటీపై రాహుల్ గాంధీ సందడి!

హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల బైక్ ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నవంబర్ 14న శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్స్ వరకు సాగిన ర్యాలీలో ఓ యువతి నడుపుతున్న హోండా యాక్టివా స్కూటీపై ఆయన వెనుక కూర్చొని ప్రయాణించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆయన వెంట పాల్గొన్నారు. చదువుకుంటూనే ఖాళీ సమయాల్లో బైక్ రైడర్‌గా పనిచేస్తున్న యువతితో రాహుల్ ప్రయాణించడం అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రయాణంలో నెమ్మదిగా వెళ్లాలని రాహుల్ సూచించినట్లు ఆ యువతి తెలిపింది. గిగ్ వర్కర్ల కోసం సామాజిక భద్రత, సంక్షేమ పథకాన్ని అధికారికంగా ప్రారంభించే కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించారు. యువతి స్కూటీపై రాహుల్ ప్రయాణించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



గడ్డం నుంచి గద్దె వరకు..

అన్న షర్ట్ ఏస్తే మాస్.. గడ్డం పెంచితే క్లాష్!

- » నేతల లుక్ వెనుక రాజకీయ లెక్క లెన్నో!
- » మాస్ లుక్ కోసమే కేటీఆర్ మేకోవర్!
- » రేవంత్ రెడ్డికి అస్త్రాన్ని అందించారా ?
- » నేతల ఆహార్యం ఓట్లు కురిపిస్తుందా ?

రాజకీయాల్లో మాటల యుద్ధం మామూలే.. కానీ ఇప్పుడు గడ్డాలు, చొక్కాలు కూడా యుద్ధరంగంలోకి దిగాయి! నిన్నటివరకు క్లాస్ లుక్‌తో కనిపించిన కేటీఆర్ ఒక్కసారిగా గడ్డం పెంచితే తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. మాస్ ఇమేజ్ కోసమేనా ఈ కొత్త అవతారం? లేక ప్రజలకు మరింత చేరువయ్యే రాజకీయ వ్యూహమా? రేవంత్ రెడ్డి మాత్రం ఈ మార్పును వదిలిపెట్టలేదు. నల్లమల పులి, నక్క వాతలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తే.. కేటీఆర్ సైతం ఎదురుదాడికి దిగారు. గడ్డం పెంచితే రేవంత్ అయిపోతారా? అంటూ కౌంటర్ ఇచ్చారు. ఇక్కడే కథకు మరో మలుపు! గతంలో ఉత్తమ్ గడ్డంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కేటీఆర్‌కు రాజకీయ అస్త్రాలుగా మారాయి. మరోవైపు రేవంత్ కొత్త చొక్కాలు, జగన్ ఆపిల్ కట్ షర్టులు చర్చలోకి వచ్చాయి. ఎన్టీఆర్ ఖాకీ దుస్తుల నుంచి వైఎస్సార్ పంచెకట్టు వరకు, కేసీఆర్ ఖద్దరు నుంచి మోదీ జాకెట్ వరకు.. ప్రతి నాయకుడి రూపం వెనుక ఓ ప్రత్యేక రాజకీయ ముద్ర ఉంది. మరి ఈ లుక్‌లతో ఓట్లు కురుస్తాయా? వేషమే విజయాన్ని తెస్తుందా? గడ్డం పెంచితే మాస్.. చొక్కా మార్చితే క్లాస్.. కానీ ప్రజల మనసు గెలిచేదెవరు? అసలు రాజకీయ విజయానికి అసలైన కొలమానం ఏమిటి? లోపలి పేజీలో ఆసక్తికర కథనం!

5లో.



కార్మికుడి కష్టం తెలుసు

అందుకే మాట నిలబెట్టుకున్నాం

శ్రమకు గుర్తింపు.. సంక్షేమానికి భరోసా

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

గిగ్ కార్మికుల కష్టాలు, కన్నీళ్లు తనకు తెలుసని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన వారిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. (వివరాలు 2లో..)



పెట్టుబడులకు ప్రపంచ గమ్యస్థానం తెలంగాణ

- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- విద్య, వైద్యం, పరిశ్రమలకు పెద్దపీట: సీఎం రేవంత్



తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిప్రకటించారు.హైదరాబాద్‌కు ఐఎస్‌బీ, నల్సార్ వంటి విద్యాసంస్థలు అంతర్జాతీయ గుర్తింపుతో పాటు పెట్టుబడులను తీసుకొస్తున్నాయని చెప్పారు. నెహ్రూ విద్య, నీటిపారుదల రంగాలకు వేసిన పునాదులు, రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సాంకేతిక విప్లవం దేశాభివృద్ధికి బలమయ్యాయని గుర్తుచేశారు. ఐటీ ఖరగ్‌పూర్, శ్రీశైలం, భాక్రా నంగల్ ప్రాజెక్టులు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాయని వివరించారు. పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు దేశానికి కొత్త దిశ చూపాయని పేర్కొన్నారు. చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి,కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన అభివృద్ధి విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలు వేరని, అభివృద్ధి విధానాలు వేరని వ్యాఖ్యానించారు. విద్యలో నాణ్యత పెంచి తెలంగాణ విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీపడేలా చేయాలని ఆకాంక్షించారు. సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభించామని, మిగతా టిమ్స్ ఆస్పత్రులతో పాటు గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆస్పత్రిని నిర్మిస్తున్నామని తెలిపారు.వైద్య మౌలిక సదుపాయాల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. (వివరాలు 2లో..)



సంపన్నుల కోసం కాదు

- సామాన్యుల కోసమే ప్రభుత్వాలు
- ప్రజాస్వామ్యం వర్సెస్ నియంతృత్వం
- భారత్ సమ్మిట్ వేదికగా సీఎం పిలుపు

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్‌సమ్మిట్ ప్రపంచ ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు వేదిక కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణకు, అద్భుతమైన హైదరాబాద్‌కు ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులకు స్వాగతం పలికారు. 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులను ఆహ్వానించామని, అయితే కేంద్ర ప్రభుత్వం వారిలో చాలామందికి వీసాలురద్దుచేసిందనివెల్లడించారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు ఈ సమావేశాన్ని గమనిస్తున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)



ఐకేఎఫ్ విజయగర్జన!

6లో

ఐదు జాతీయ అవార్డులతో జయకేతనం

ఒక సంస్థ ఎదగడం గొప్ప కాదు.. తనతో పాటు వేలాది మంది కలలను ముందుకు నడిపించడం అసలైన విజయం! విజయవాడలో 1991లో చిన్న అడుగులతో మొదలైన ఐకేఎఫ్ ఫైనాన్స్ ప్రస్థానం.. నేడు 12 రాష్ట్రాలు, 220 శాఖలు, లక్షకు పైగా రుణగ్రహీతలకు చేరిన జాతీయ ప్రయాణంగా రూపాంతరం చెందింది. ఆర్థిక బలం, ఉద్యోగుల ప్రతిభ, పటిష్టమైన రిస్క్ నియంత్రణ.. ఈ మూడు ఆయుధాలతో జాతీయ వేదికపై ఐదు పురస్కారాలను కైవసం చేసుకుంది. రూ. 749 కోట్లకు పైగా ఈక్విటీ సమీకరణ.. రూ. 6,718 కోట్ల ఆస్తుల నిర్వహణ.. లాభాల్లో 52.7 శాతం వృద్ధి.. ఇవి కేవలం గణాంకాలు కావు.. సంస్థ సాధించిన విశ్వాసానికి ప్రతిబింబాలు! కొత్త రుణం అందించడం కాదు.. కస్టమర్ జీవితంలో కొత్త ఎదుగుదలకు బాటలు వేయడమే లక్ష్యంగా సాగుతోంది.

కాంగ్రెస్ హామీలన్నీ హుష్‌కాకి!

- » 420 హామీలు.. 13 డిక్లరేషన్లు
- » ఆరు గ్యారెంటీలపై నిలదీత
- » హామీల కొండ.. అమలులో శూన్యం!
- » రాహుల్‌కి కేటీఆర్ సూటి ప్రశ్నలు



కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయహస్తం'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి నేరుగా ప్రశ్నలు సంధిస్తూ, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల అమలు పరిస్థితిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు (2లో..)

తెలంగాణ నీటి హక్కులపై తేల్చుకోండి!

- » మోదీని నిలదీస్తారా? తలవంచి వస్తారా?
- » సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సూటి ప్రశ్నలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రేపు ఢిల్లీ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు కీలక సవాల్ విసిరారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీని నిలదీసి స్పష్టమైన హామీలు తీసుకువస్తారా? లేక ఎప్పటిలాగే మౌనంగా తిరిగి వస్తారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు గోదావరి జలాల విషయంలో చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. (2లో..)

హైడ్రా పేరుతో బెదిరింపులా?

- » ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తారా
- » రాహుల్‌పై ఎంపీ ఈటల ధ్వజం



తెలంగాణలో తాగునీరు, సాగునీటి సమస్యలు పరిష్కరించకుండా భారత్ సమ్మిట్ పేరుతో విదేశీ ప్రతినిధులను ఆహ్వానించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈటల ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు లేని దేశాల ప్రతినిధులను హైదరాబాద్‌కు పిలవడం ఏం సాధిస్తుందని నిలదీశారు. రాహుల్‌గాంధీ విదేశీ వేదికలపై భారత ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం, పార్లమెంట్, సైనిక వ్యవస్థలపై విమర్శలు చేయడం తగదన్నారు. (వివరాలు 3లో..)



2లో..

ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి వైఎస్‌యూ, పాలిటెక్నిక్‌లు!

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా.. ప్రభుత్వ కీలక నిర్ణయం

జీఓ 157 విడుదల.. ఐటీఐలు, ఏటీసీలు ఇక శక్తి శాఖలోకి

బీజేపీ ఓటమి ఖాయం

- ప్రజల్లో మార్పు మొదలైంది
- అధికారం నుంచి దించుతాం
- మోదీ, అమిత్ షాలో భయం కనిపిస్తోంది
- భారత్ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్



ప్రధాని నరేంద్ర మోదీని ఓడించి అధికారంలో నుంచి దించడం ఇక ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ 2026లో ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, ప్రజల్లోనే కాకుండా ఢిల్లీలోనూ ఈ పరిణామాలు ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలో భయం కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. 2014 తర్వాత బీజేపీ రాజకీయ ఆధిపత్యాన్ని చూసి ప్రతిపక్షాలు దాదాపు పదేళ్లపాటు దిగ్భ్రాంతిలో ఉన్నాయని అంగీకరించారు. మీడియా, పత్రికలు, ఇంటర్వ్యూలు, బహిరంగ సభల ద్వారా ప్రజల్లోకి వెళ్లే సంప్రదాయ మార్గాలు పనిచేయడం లేదని గుర్తించామని చెప్పారు. చివరకు ప్రజలతో నేరుగా మమేకం కావడమే ప్రత్యామ్నాయమని నిర్ణయించుకున్నట్లు వివరించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగిన భారత్ జోడో యాత్ర కాంగ్రెస్ ప్రతిదాడికి పునాదిగా నిలిచిందని, వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి వల్లే ప్రజలతో అనుబంధం బలపడిందని పేర్కొన్నారు.

ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు.. అదానీపై విమర్శలు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ మరోసారి అనుమానాలు వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం మూడు నెలల వ్యవధిలో 70 లక్షల మంది కొత్త ఓటర్లు జాబితాలో చేరారని, వారంతా బీజేపీకే ఓటు వేశారని ఆరోపించారు. రెండు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల సంఖ్య దాదాపు ఒకేలా ఉన్నప్పటికీ ఫలితాల్లో భారీ తేడా వచ్చిందని ప్రశ్నించారు. ఇలాంటి పరిణామాలు ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరుపై తీవ్ర సందేహాలు కలుగుతున్నాయని అన్నారు. మరోవైపు ప్రధాని మోదీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ మధ్య సంబంధాలను లక్ష్యంగా చేసుకున్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు ప్రపంచ కుబేరుల జాబితాలో 600వ స్థానంలో ఉన్న అదానీ కొద్ది నెలల్లోనే రెండో స్థానానికి చేరడం వెనుక రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కలయిక ఉందని ఆరోపించారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, రక్షణ, సిమెంట్, మౌలిక సదుపాయాల రంగాల్లో అదానీ సంస్థల విస్తరణపై ప్రశ్నలు సంధించారు. గత పదేళ్లలో బీజేపీ ఆస్తులు 11 రెట్లు పెరిగాయని, దీనివల్ల ప్రతిపక్షాలకు ఆర్థికంగా సమానంగా పోటీపడటం కష్టమవుతోందని విమర్శించారు.

నియంతృత్వ ధోరణులపై పోరు.. విదేశీ ప్రతినిధులకు క్షమాపణ

ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచే ధోరణులే ఫాసిస్టు లక్షణాలని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తమకే అన్నీ తెలుసని భావించడం, తప్పులను అంగీకరించకపోవడం, చర్చలకు బదులుగా కేకలు వేయడం నియంతృత్వ ధోరణులకు సంకేతాలని అన్నారు. ప్రతిపక్ష నేతలపై ప్రభుత్వ సంస్థలను ప్రయోగిస్తున్నారని ఆరోపిస్తూ, తనపై 45 కేసులు ఉన్నాయని వెల్లడించారు. భారత్ సమ్మిట్‌కు రావాల్సిన విదేశీ ప్రతినిధులకు అనుమతులు నిరాకరించడంపై విచారం వ్యక్తం చేశారు. భారత్‌కు రాలేకపోయిన అంతర్జాతీయ ప్రతినిధులకు క్షమాపణలు చెబుతూ, ఇది తమ తప్పు కాదని స్పష్టం చేశారు. విదేశీ పక్షుల ప్రవేశంపై కేంద్రం వ్యవహరించిన తీరు దేశంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతోందని విమర్శించారు. విదేశాంగ శాఖ అనుమతించిన 315 మంది పక్షుల్లో 115 మందికి ప్రవేశం నిరాకరించారని లేదా వీసాలు రద్దు చేశారని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ గతంలో పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం, ఎన్నికల పారదర్శకత, సామాజిక న్యాయం కోసం ప్రజలతో కలిసి పోరాడతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.





కార్మికుడి కష్టం తెలుసు

అందుకే మాట నిలబెట్టుకున్నాం శ్రమకు గుర్తింపు.. సంక్షేమానికి భరోసా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

గిగ్ కార్మికుల కష్టాలు, కన్నీళ్లు తనకు తెలుసని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన వారిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికుల శ్రమను గుర్తించి వారికి అండగా నిలుస్తామని గతంలో తాను, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ప్రకటించారు. దేశంలో ఇప్పటివరకు గిగ్ కార్మికుల పనితీరు, డెలివరీలకు పట్టే సమయం, వారికి అందుతున్న ఆదాయం వంటి వివరాలతోకూడిన సమగ్ర సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టం కార్మికులది.. కానీ వారి శ్రమకు సంబంధించిన సమాచారం కూడా వారి చేతుల్లో లేదు అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి డెలివరీకి సంబంధించిన చెల్లింపుల వివరాలను కార్మికులకు తెలియజేస్తోందని చెప్పారు.

బీమా నుంచి పింఛన్ వరకు.. సంక్షేమ భరోసా

ఎండనకా, వాననకా మోటార్ సైకిళ్లపై తిరుగుతూ డెలివరీలు చేసే కార్మికులకు విశ్రాంతి తీసుకునేందుకు కనీస సదుపాయాలు కూడా ఉండేవి కావని రాహుల్ గుర్తుచేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర నగరాల్లో ప్రభుత్వం ప్రత్యేక విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాల సమయంలో అండగా నిలిచేందుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బీమా సదుపాయాలు, పింఛన్ సహా ఇతర సంక్షేమ ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రతి డెలివరీ, రవాణా లావాదేవీపై ఒక శాతం మొత్తాన్ని గిగ్ కార్మికుల సంక్షేమ బోర్డుకు జమ చేసి, అక్కడి నుంచి అర్హులైన కార్మికుల ఖాతాలకు చేరేలా వ్యవస్థను రూపొందించామని చెప్పారు. ఈ చర్యలతో కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించడమే కాకుండా వారి శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

కార్మికులే దేశానికి పునాది.. కాంగ్రెస్ సిద్ధాంతం

దేశంలో రెండు భిన్నమైన ఆలోచనా విధానాలు ఉన్నాయని రాహుల్ గాంధీ అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానం కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించుకుంటూ వారి శ్రమను దోచుకునేదిగా ఉందని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి సంపన్న పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చే విధానాలు అమలవుతున్నాయని ఆరోపించారు. మరోవైపు గిగ్ కార్మికులే దేశానికి పునాది, అభివృద్ధిలో భాగస్వాములు అన్నదే కాంగ్రెస్ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రతి డెలివరీలో కార్మికులకు వాటా ఉండాలని, వారికి విశ్రాంతి, ఆరోగ్య రక్షణ, సామాజిక భద్రత కల్పించాలని కాంగ్రెస్ కోరుకుంటోందన్నారు. ప్రధాని మోదీ విధానాలు కార్మికులకు ప్రయోజనాలు అందకుండా చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం గిగ్ కార్మికులకు అండగా ఉంటుందని, వారి పిల్లల చదువులు, కుటుంబ ఆరోగ్య బాధ్యతలను కూడా ప్రభుత్వం పట్టించుకుంటుందని భరోసా ఇచ్చారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.. మీకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది అంటూ జైహింద్, జైతెలంగాణ నినాదాలతో ప్రసంగాన్ని ముగించారు.

సంపన్నుల కోసం కాదు

- సామాన్యుల కోసమే ప్రభుత్వాలు
- ప్రజాస్వామ్యం వర్సెస్ నియంతృత్వం
- భారత్ సమ్మిట్ వేదికగా సీఎం పిలుపు



తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ ప్రపంచ ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు వేదిక కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణకు, అద్భుతమైన హైదరాబాద్‌కు ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులకు స్వాగతం పలికారు. 70 దేశాల నుంచి వెయ్యిమందికి పైగా ప్రతినిధులను ఆహ్వానించామని, అయితే కేంద్ర ప్రభుత్వం వారిలో చాలామందికి వీసాలు రద్దు చేసిందని వెల్లడించారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు ఈ సమావేశాన్ని గమనిస్తున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. నెహ్రూ జయంతి రోజున ఈ సదస్సు జరగడం ప్రత్యేకమని పేర్కొన్నారు. భారతదేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దార్శనికత పునాదిగా నిలిచిందని గుర్తుచేశారు.

ప్రజాస్వామ్యానికి నియంతృత్వానికి మధ్య పోరు

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనుకునే శక్తులకు, దాన్ని బలహీనపరచాలని చూసే శక్తులకు మధ్య పోరాటం సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. రాజ్యాంగం, చట్టబద్ధ పాలన, ప్రతి పౌరుడి ఓటు హక్కు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం తమ లక్ష్యాలని స్పష్టం చేశారు. పేదలు, మహిళలు, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాలకు రక్షణ కల్పించాలని కోరుకుంటున్నామని చెప్పారు. మరోవైపు కొద్దిమంది సంపన్నుల ప్రయోజనాల కోసం అధికారాన్ని కేంద్రీకరించే ధోరణి పెరుగుతోందని విమర్శించారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలే తప్ప, ఒకే వ్యక్తి ఆదేశాలతో పాలన సాగకూడదన్నారు. ప్రపంచీకరణ, కరోనా అనంతర పరిస్థితుల్లో విద్య, ఉపాధి, వైద్యం, ద్రవ్యోల్బణం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ వంటి సమస్యలను అన్ని దేశాల ప్రజలు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రజల కలలు, ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యత అందరిపై ఉందన్నారు.

రాహుల్ నాయకత్వంలో మార్పు సాధిద్దాం

ఈ ప్రజాస్వామ్య పోరాటానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశంలో నాయకత్వం వహిస్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, దళితులు, మైనారిటీలు, ఓబీసీలకు సామాజిక న్యాయం అందించడం కోసం ఆయన పోరాడుతున్నారని చెప్పారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ రాహుల్ గాంధీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు సంపన్నుల ప్రయోజనాల కోసం కాకుండా సామాన్య ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి అని స్పష్టం చేశారు. తమను ఎవరూ ఆపలేరని, గొప్ప లక్ష్యం కోసం ఐక్యంగా పోరాడితే ఏ శక్తీ అడ్డుకోలేదని ధీమా వ్యక్తం చేశారు. 70 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఈ సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లాలని కోరారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంతర్జాతీయ స్థాయిలో ఐక్య పోరాటం సాగించాలని పిలుపునిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

పెట్టుబడులకు ప్రపంచ గమ్యస్థానం తెలంగాణ

• 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ • విద్య, వైద్యం, పరిశ్రమలకు పెద్దపీట: సీఎం రేవంత్

వైద్య మౌలిక సదుపాయాల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు.

రీజినల్ రింగ్ రోడ్డుతో పారిశ్రామిక విప్లవం

తెలంగాణకు పెట్టుబడుల విషయంలో ఎలాంటి విధానపరమైన గందరగోళం లేదని, పెట్టుబడిదారులకు పూర్తి భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపల 1.34 కోట్ల జనాభా ఉందని, అక్కడి పరిశ్రమలను బయటకు తరలించి సేవారంగాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 160 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డుకు టెండర్లు పిలిచామని, 10 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో తయారీ రంగాన్ని విస్తరిస్తున్నామని వివరించారు. భూమి, నీరు, అనుమతుల కోసం సమగ్ర విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు అవతలి ప్రాంతాన్ని రేర్‌గా అభివృద్ధి చేస్తూ ప్రపంచ దిగ్గజ సంస్థలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ఆదాయంలో 65 శాతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచే వస్తోందని, రంగారెడ్డి జిల్లా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాగా నిలిచిందని పేర్కొన్నారు. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడం, దేశ జీడీపీలో 10 శాతం వాటా సాధించడం తమ లక్ష్యమని వెల్లడించారు. రాఫెల్ విడిభాగాల తయారీ, ఫార్మా పరిశ్రమ, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ కేంద్రంగా మారుతోందన్నారు. బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం ఉత్పత్తి ఇక్కడే జరుగుతోందని, ఎలీ లిల్లీ సంస్థ ఒక బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుందని తెలిపారు.

వైద్య రంగానికి రూ.12 వేల కోట్లు.. మూసీ ప్రక్షాళనకు ప్రాధాన్యం

విద్యతో పాటు ప్రజారోగ్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఏటా రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించి రోగుల వివరాలను సేకరిస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సమీకరించిన సమాచారంతో తెలంగాణను డేటా రిచ్ స్టేట్‌గా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ప్రాంతాలవారీగా ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కారాలు రూపొందించవచ్చన్నారు. ఫ్లోరైడ్ ప్రభావం, మూసీ కాలుష్యం కారణంగా నల్గొండ జిల్లాలో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పుట్టబోయే పిల్లల ఆరోగ్యంపై కూడా దుష్ప్రభావాలు పడుతున్నాయని పేర్కొన్నారు. మూసీని ప్రక్షాళన చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. పీహెచ్ఎఫ్ఐ ప్రాజెక్టును 2028 జూన్ 2 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని, ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సంస్థకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో తాను స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని ప్రకటించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ప్రజారోగ్యం, విద్యారంగాల్లో తెలంగాణను ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



కాంగ్రెస్ హామీలన్నీ హుష్‌కాకి!

- 420 హామీలు.. 13 డిక్లరేషన్లు
- ఆరు గ్యారెంటీలపై నిలదీత
- హామీల కొండ.. అమలులో శూన్యం!
- రాహుల్‌కి కేటీఆర్ సూటి ప్రశ్నలు



కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయహస్తం'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి నేరుగా ప్రశ్నలు సంధిస్తూ, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల అమలు పరిస్థితిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఖర్చుతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గొప్పగా ప్రకటించిన హామీలకు, మూడేళ్ల పాలనలో జరిగిన అమలుకు పొంతన లేదని విమర్శించారు. కాంగ్రెస్ మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం గడప దాటడం లేదన్నారు కేటీఆర్.

బీసీలకు రూ.లక్ష కోట్లు.. దక్కింది రూ.5 వేల కోట్లలోపే!

బీసీ డిక్లరేషన్‌లో వెనుకబడిన వర్గాల కోసం రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి, మూడేళ్లలో రూ.5 వేల కోట్లలోపే ఖర్చు చేశారని కేటీఆర్ ఆరోపించారు. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తామన్న హామీ అమలుకాలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించే అంబేద్కర్ అభయహస్తం పథకం ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఈ వర్గాలకు 31 శాతం వాటా కల్పిస్తామన్న హామీ కూడా నెరవేరలేదన్నారు. బీసీలకు నిధులు లేవు.. ఎస్సీ, ఎస్టీలకు పథకాలు లేవు.. హామీల అమలులో మాత్రం శూన్యమే అని ఎద్దేవా చేశారు.

యువత, విద్యార్థులు, మైనారిటీలకు అన్యాయం!

యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, రాజీవ్ యువ వికాసం అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు 10 వేల ఉద్యోగాలకే పరిమితమైందని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థులకు రూ.5 లక్షల విలువైన విద్యా భరోసా కార్డు ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. మైనారిటీలకు ఏటా రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, రూ.వెయ్యి కోట్లలోపే నిధులు ఖర్చు చేశారని విమర్శించారు. ఈ హామీల జాబితా ఇంకా చాలా ఉందని, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు మోసపోయారని ఆరోపించారు. ఎన్నికల ముందు హామీల వర్షం.. అధికారంలోకి వచ్చాక అమలులో నిర్లక్ష్యం అంటూ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. #CongressConnedTelangana, #CongressFailedTelangana నినాదాలతో తన విమర్శలకు పదును పెట్టారు.



తెలంగాణ నీటి హక్కులపై తేల్చుకోండి!

సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సూటి ప్రశ్నలు

గతంలో కేసీఆర్ తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీపడకుండా పోరాడారని గుర్తుచేశారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానాన్ని ఇచ్చంపల్లి నుంచే చేపట్టాలని, తరలించే 148 టీఎంసీల్లో తెలంగాణకు 50 శాతం వాటా అంటే సుమారు 75 టీఎంసీలు కేటాయించాలని కేంద్రాన్ని ఒప్పించారని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం జరుగుతోందని విమర్శించారు.

సమ్మక్క-సారక్కకు అనుమతులేవి?

47 టీఎంసీల నీటి వినియోగ సామర్థ్యంతో ప్రతిపాదించిన సమ్మక్క-సారక్క ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం కొత్త మార్గదర్శకాల పేరుతో వెనక్కి పంపడంపై హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు చంద్రబాబు ఒత్తిడితో ఇచ్చంపల్లి మార్గానికి బదులుగా పోలవరం-బనకచర్ల నుంచి నదుల అనుసంధానం చేపట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణకు చట్టబద్ధంగా దక్కాల్సిన 968 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి సంబంధించిన అన్ని ప్రాజెక్టులకు తక్షణమే కేంద్ర అనుమతులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ రూపొందించిన డీపీఆర్ ప్రకారమే గోదావరి-కావేరి అనుసంధానం ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులో తరలించే 148 టీఎంసీల్లో తెలంగాణకు సుమారు 75 టీఎంసీలు కేటాయించాలని, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే పోలవరం-బనకచర్ల అలైన్‌మెంట్‌ను కేంద్రం వద్ద గట్టిగా వ్యతిరేకించాలని సూచించారు.

ఖాళీ చేతులతో వస్తే ఉద్యమమే!

తెలంగాణ నీటి ప్రయోజనాలను తాకట్టు పెట్టి చంద్రబాబు ఒత్తిడికి తలొగ్గితే రేవంత్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి చరిత్రలో బాధ్యత వహించాల్సి వస్తుందని హరీశ్‌రావు హెచ్చరించారు. ఢిల్లీ పర్యటనలో ప్రధాని నుంచి స్పష్టమైన హామీలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమ్మక్క-సారక్కకు అనుమతులు, 968 టీఎంసీల వినియోగానికి మార్గం, ఇచ్చంపల్లి నుంచే నదుల అనుసంధానం, 75 టీఎంసీలు వాటా విషయంలో స్పష్టత సాధించాల్సిందేనని తేల్చిచెప్పారు. కేవలం ఢిల్లీ పర్యటన చేసి ప్రకటనలతో సరిపెట్టుకోవద్దని హితవు పలికారు. ప్రధాని నుంచి హామీలు తీసుకురాకుండా ఖాళీ చేతులతో తిరిగొస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని ప్రకటించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి వైఎస్‌యూ, పాలిటెక్నిక్‌లు!



తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక విద్యార్థుల విద్యా, ఉద్యోగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయం తీసుకుంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఎస్‌యూ), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 13న విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 157 ద్వారా గతంలో జారీ చేసిన జీఓ 97కు సవరణలు చేసింది. ఈ ఏడాది జూన్ 16న జారీ చేసిన పాత ఉత్తర్వుల ప్రకారం వైఎస్‌యూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు), ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు నైపుణ్య, మానవ వనరులు, నాలెడ్జ్ శిక్షణ కార్యక్రమాల శాఖ (శక్తి) పరిధిలో ఉండేవి. తాజా నిర్ణయంతో వైఎస్‌యూ, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల పరిపాలనా బాధ్యతలు ఉన్నత విద్యాశాఖకు బదిలీ అయ్యాయి.

ఐటీఐలు, ఏటీసీలు శక్తి శాఖలోనే

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ సిఫారసుల మేరకు ఈ మార్పులు చేపట్టింది. పాలిటెక్నిక్ విద్యను ఆధునికీకరించడం, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం. మరోవైపు ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మాత్రం శక్తి శాఖ పరిధిలోనే కొనసాగుతాయి. అయితే వాటి పాఠ్యప్రణాళికల నియంత్రణ బాధ్యతలు వైఎస్‌యూకు అప్పగించారు. విశ్వవిద్యాలయం తన విద్యా కార్యక్రమాలను విస్తరించేందుకు ఏఐసీటీఈతో పాటు ఇతర సంబంధిత అధికార సంస్థల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని ప్రభుత్వం ఆదేశించింది. తాజా మార్పులతో సాంకేతిక విద్యలో పరిపాలనా సుస్పష్టత పెరగడంతో పాటు విద్యార్థుల ప్రయోజనాలకు మరింత రక్షణ లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

విద్యార్థుల పోరాటానికి విజయం: హరీశ్ రావు

35 రోజుల ఉద్యమం.. విద్యార్థుల ఐక్యత ముందు ప్రభుత్వం దిగొచ్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నత విద్యాశాఖ పరిధిలోనే కొనసాగిస్తూ ప్రభుత్వం జీవో 157 విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. జీవో 97ను సవరించడం విద్యార్థుల ఐక్య పోరాటానికి దక్కిన విజయమని అభివర్ణించారు. తెలంగాణ పాలిటెక్నిక్ జేఏసీ, విద్యార్థులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలు చేయడం సరికాదని, తప్పుడు నిర్ణయాలను సరిదిద్దుకోవడానికి విద్యార్థులు 35 రోజుల పాటు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన ప్రభుత్వం విద్యార్థుల ఆందోళన తర్వాతే స్పందించడం పాలనాపరమైన వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తుతోందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పగ్గాలు సందీప్‌కు!

- మీనాక్షి నటరాజన్‌కు ఉద్వాసన
- కర్ణాటక నేతకు కీలక బాధ్యతలు
- తక్షణమే అమల్లోకి కొత్త నియామకం



తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కర్ణాటకకు చెందిన సీనియర్ నేత బి.ఎం. సందీప్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ స్థానంలో ఆయనకు అవకాశం కల్పిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నిర్ణయం తీసుకుంది. శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. కొత్త నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించిన మీనాక్షి నటరాజన్ సేవలను పార్టీ గుర్తించి కృతజ్ఞతలు తెలిపింది. అయితే ఆమెను ఎందుకు మార్చారన్న కారణాన్ని అధికారిక ప్రకటనలో వెల్లడించలేదు.

రెండేళ్ల అధ్యయన సెలవుపై మీనాక్షి

మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ నుంచి గతంలో లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన మీనాక్షి నటరాజన్ రెండేళ్లపాటు అధ్యయన సెలవుపై బ్రిటన్ వెళ్లాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆమె స్థానంలో కొత్త ఇన్‌ఛార్జిని నియమించినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానం అధికారికంగా ఎలాంటి వివరణ ఇవ్వలేదు. మరోవైపు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణలో కొత్త ఇన్‌ఛార్జి పాత్ర కీలకం కానుంది. రాష్ట్ర నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆయనపై ఉండనుంది.

సంస్థాగత అనుభవమే సందీప్‌కు బలం

కర్ణాటకలోని చిక్కమగళూరుకు చెందిన బి.ఎం. సందీప్ యువజన కాంగ్రెస్ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం పార్టీలో పలు కీలక సంస్థాగత పదవులు చేపట్టారు. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్‌లో జాతీయ కన్వీనర్‌గా, కర్ణాటక రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. ఏఐసీసీ కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలకు సహ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన అనుభవం ఆయనకు ఉంది. కేరళకు అదనపు ఏఐసీసీ కార్యదర్శిగా కూడా సేవలందించారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత వ్యవహారాలపై పనిచేసిన అనుభవంతో ఇప్పుడు తెలంగాణ బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో సమన్వయం పెంచడం, పార్టీని మరింత బలోపేతం చేయడం ఆయన ముందున్న ప్రధాన సవాళ్లుగా నిలవనున్నాయి.

ఫిబ్రవరి కోటా టీటీడీ షెడ్యూల్ విడుదల!

- నవంబర్ 18 నుంచి ఆన్‌లైన్ బుకింగ్‌లు
- 24న ప్రత్యేక దర్శనం, గదుల కోటా
- 18, 21 తేదీల్లో అర్జిత సేవల టికెట్లు



తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ కీలక సమాచారం అందించింది. 2027 ఫిబ్రవరి నెలకు సంబంధించిన వివిధ దర్శనాలు, ఆర్జిత సేవలు, వసతి గదుల ఆన్‌లైన్ కోటా విడుదల తేదీలను ప్రకటించింది. నవంబర్ 18 ఉదయం 10 గంటలకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల టికెట్లకు ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రారంభమవుతుంది. నవంబర్ 20 ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. టికెట్లు కేటాయించిన భక్తులు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు చెల్లింపులు చేయాలి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లు నవంబర్ 21 ఉదయం 10 గంటలకు విడుదలవుతాయి. వర్చువల్ సేవలు, దర్శన స్లాట్ల కోటా అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు అందుబాటులోకి వస్తుంది.

23, 24 తేదీల్లో దర్శనం, వసతి కోటా

నవంబర్ 23 ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారి ఉచిత ప్రత్యేక దర్శన టోకెన్లు అందుబాటులోకి వస్తాయి. నవంబర్ 24 ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని వసతి గదుల కోటా విడుదల కానుంది. భక్తులు టికెట్ల కోసం అధికారిక టీటీడీ వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుకింగ్ చేసుకోవాలని టీటీడీ సూచించింది. నిర్దిష్ట తేదీలు, సమయాలను గమనించి ముందుగానే నమోదు చేసుకోవాలని కోరింది.

పౌరసరఫరాల శాఖకు కొత్త సారథి బాధ్యతలు



తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీగా, లీగల్ మెట్రాలజీ కంట్రోలర్‌గా ఐపీఎస్ అధికారి వై. నాగిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అంతరాయం లేకుండా రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ధాన్యం తూకం, నిల్వలు, రవాణా, మిల్లింగ్‌లో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. కస్టమ్ మిల్లింగ్‌లో బకాయిలు, నిల్వల లెక్కలు పరిశీలించి అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులందరికీ రేషన్ అందేలా కార్డుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. నిత్యావసర ధరలు, నిల్వలు, పెట్రోల్ బంకులు, ప్యాకేజ్డ్ వస్తువుల కొలతలపై నిఘా పెంచుతామన్నారు. నిర్లక్ష్యం, తప్పుడు నివేదికలను సహించబోమని, నిజాయితీగా పనిచేసే అధికారులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.



తెలంగాణ గ్రేహౌండ్స్

దేశానికే ఆదర్శం

తెలంగాణ గ్రేహౌండ్స్ దేశ పోలీసు వ్యవస్థకే ఆదర్శంగా నిలుస్తోందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. రాజేంద్రనగర్‌లో గ్రేహౌండ్స్ కోసం నిర్మించిన ప్రత్యేక 'SPS OODA షూట్ హౌస్'ను శనివారం ప్రారంభించారు. నక్సలిజం, ఉగ్రవాదం, హైజాకింగ్ ముప్పులను ఎదుర్కోవడంలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సిబ్బంది సంఖ్య 700కు తగ్గకుండా చూడాలని, అటవీ ప్రాంతాల్లో జంగిల్ ప్రాక్టీస్, వార్‌ఫేర్ శిక్షణ కొనసాగించాలని ఆదేశించారు. 2027 ఫిబ్రవరి 2 నుంచి జోధ్‌పూర్‌లో జరిగే ఆల్ ఇండియా పోలీస్ కమాండో పోటీల్లో ప్రథమ స్థానం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అమరవీరులు సందీప్, పవన్, శ్రీధర్ పేర్లతో ఏర్పాటు చేసిన షూట్ హౌస్‌లో పరిశీలన, నిర్ణయం, తక్షణ చర్యల నైపుణ్యాలను పెంపొందించనున్నారు.

తెలియని గన్‌మెన్ భయం.. ఉగ్రవాదుల పరుగు!

- సురక్షిత స్థావరాలకు హఫీజ్ సయీద్, మసూద్ తరలింపు
- పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ రక్షణలో ఇద్దరు ఉగ్రవాదులు



భారత్‌పై ఉగ్రదాడులకు పాల్పడిన ఇద్దరు కీలక ఉగ్రవాదులు హఫీజ్ సయీద్, మసూద్ అజర్ ఇప్పుడు ప్రాణభయంతో వణికిపోతున్నట్లు నిఘా వర్గాల సమాచారం. గత వారం రోజులుగా వీరిద్దరినీ అత్యంత రహస్యంగా కొత్త ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఆధ్వర్యంలో భారీ భద్రత కలిగిన రహస్య నివాసాల్లో వీరికి ఆశ్రయం కల్పించినట్లు సమాచారం. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం, పాకిస్తాన్‌లో ఇటీవల పలువురు భారత్ వ్యతిరేక ఉగ్రవాదులు గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమవుతుండటంతో ఐఎస్ఐలో ఆందోళన పెరిగినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి.

నగరాలు మారిన ఉగ్రవాద నేతలు

లష్కరే తోయిబా అధినేత హఫీజ్ సయీద్‌ను లాహోర్‌లోని జోహర్ టౌన్ నుంచి రావల్పిండిలోని గ్యారిసన్ గ్రౌండ్ ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఈ ప్రాంతం పాకిస్తాన్ సైనిక ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉండటం గమనార్హం. మరోవైపు జైషే మహమ్మద్ అధినేత మసూద్ అజర్‌ను సింధ్ ప్రావిన్స్‌లోని నవాబ్‌షాకు తరలించినట్లు తెలుస్తోంది. సయీద్ లష్కరే సభ్యులను నేరుగా కలవడం మానేసి, ఆడియో సందేశాల ద్వారానే మాట్లాడుతున్నాడు. అజర్ సైతం తన అనుచరులతో ప్రత్యక్ష సంబంధాలను తగ్గించుకుని, కొద్దిమంది కీలక కమాండర్లతో మాత్రమే సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇద్దరి కదలికలపైనా ఐఎస్ఐ కఠిన ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

జైళ్లలో కాదు.. ఐఎస్ఐ నీడలో!

సయీద్ ఉగ్రవాద కార్యకలాపాలకు నిధుల సమీకరణ కేసుల్లో లాహోర్‌లోని కోట్ లఖ్‌పత్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడని పాకిస్తాన్ చెబుతోంది. అయితే, ఇది కేవలం ప్రపంచాన్ని నమ్మించేందుకు చేస్తున్న ప్రచారమని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. అతడు రహస్య నివాసంలో సౌకర్యవంతంగా ఉంటున్నట్లు పేర్కొంటున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో బహావల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రం మర్కజ్ భారీగా దెబ్బతినడంతో ఆ సంస్థ తిరిగి పుంజుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఐక్యరాజ్యసమితి ఇద్దరినీ అంతర్జాతీయ ఉగ్రవాదులుగా ప్రకటించింది. 26/11 ముంబై దాడులతో పాటు పలు ఉగ్రదాడుల్లో సయీద్ కోసం భారత్ వెతుకుతుండగా, పుల్వామా, పఠాన్‌కోట్, పార్లమెంట్‌పై దాడుల వెనుక అజర్ కీలక సూత్రధారిగా ఉన్నాడు. ప్రస్తుతం వీరు జైళ్లలో కాకుండా ఐఎస్ఐ రక్షణలోనే ఉన్నారన్నది నిఘా వర్గాల ప్రధాన ఆరోపణ.

చైనా చిప్స్ పాలసీతో ట్రంప్‌కు లాభాల పంట!

- ఎన్విడియా షేర్ల కొనుగోలు, లాభాలపై వివాదం
- షేర్లలో పెట్టుబడి.. అవినీతి ఆరోపణలు
- విధాన మార్పుకు ముందే షేర్ల కొనుగోలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న చైనా చిప్స్ విధాన నిర్ణయాలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. ఎన్విడియా సంస్థకు ప్రయోజనం చేకూర్చేలా విధానాలు మార్చకముందే ట్రంప్ ఆ కంపెనీ షేర్లలో భారీగా పెట్టుబడి పెట్టినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ట్రంప్ ఆర్థిక లావాదేవీల వివరాలను పరిశీలించిన అవినీతి వ్యతిరేక సంస్థ డెక్లెప్టోక్రసీ ఈ అంశాన్ని బయటపెట్టింది. 2025 మేలో బైడెన్ ప్రభుత్వం అమలు చేసిన ఏఐ చిప్స్ ఎగుమతి ఆంక్షలను తొలగించడానికి కొద్ది రోజుల ముందే ట్రంప్ 10 లక్షల నుంచి 50 లక్షల డాలర్ల విలువైన ఎన్విడియా షేర్లు కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఆపిల్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి టెక్నాలజీ సంస్థల్లోనూ ఆయన పెట్టుబడులు పెట్టినట్లు ఆర్థిక నివేదికలు సూచిస్తున్నాయి.

చైనాకు చిప్స్ అమ్మకాలకు గ్రీన్‌సిగ్నల్

చైనా అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను అందుకోకుండా నిరోధించేందుకు బైడెన్ ప్రభుత్వం 'ఏఐ డిఫ్యూజన్ ఫ్రేమ్‌వర్క్'ను తీసుకొచ్చింది. అమెరికా జాతీయ భద్రతను కాపాడటం, ఏఐ రంగంలో ఆధిపత్యాన్ని కొనసాగించడం దీని లక్ష్యం. అయితే ట్రంప్ ప్రభుత్వం 2025 మేలో ఈ నిబంధనలను రద్దు చేసింది. దీంతో ఎన్విడియాకు చైనాలో చిప్స్ విక్రయించే అవకాశాలు పెరిగాయి. గతంలో 2010 నుంచి 2022 మధ్య సంస్థ అమ్మకాల్లో చైనా వాటా సుమారు 25 శాతంగా ఉంది. విధాన మార్పు ప్రకటన తర్వాత ఎన్విడియా షేర్ల విలువ పెరిగింది. 2025 డిసెంబర్‌లో హెచ్200 చిప్స్‌ను చైనాకు విక్రయించేందుకు ట్రంప్ అనుమతించారు. 2026 జనవరిలో వాణిజ్య శాఖ దీనికి ఆమోదం తెలిపింది. అప్పట్లో చైనాలో అందుబాటులో ఉన్న చిప్స్ కంటే హెచ్200 దాదాపు ఆరు రెట్లు శక్తివంతమైనదని నివేదిక పేర్కొంది. ఈ నిర్ణయం తర్వాత ట్రంప్ కనీసం మూడు సార్లు ఎన్విడియా షేర్లు కొనుగోలు చేశారు. ఒక్కో లావాదేవీ విలువ 2,50,001 నుంచి 5 లక్షల డాలర్ల మధ్య ఉంది.

అధ్యక్ష పదవా.. వ్యక్తిగత లాభమా?

ట్రంప్ పెట్టుబడులు, ఆయన తీసుకున్న విధాన నిర్ణయాల మధ్య సంబంధంపై డెక్లెప్టోక్రసీ తీవ్ర సందేహాలు వ్యక్తం చేసింది. అధ్యక్షుడి వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాలు ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేశాయా అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఎన్విడియా షేర్లలో ట్రంప్ పదవిలోకి వచ్చిన తర్వాత కూడా డజన్ల కొద్దీ లావాదేవీలు జరిగినట్లు ఆర్థిక వివరాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు హెచ్200 చిప్స్ విక్రయాలకు అనుమతి ఇవ్వడం చైనా ఏఐ సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని అమెరికా విదేశాంగ విధాన పరిశోధనా సంస్థ కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో దేశ భద్రత కంటే వ్యక్తిగత పెట్టుబడులకే ప్రాధాన్యమిచ్చారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ట్రంప్ విధాన నిర్ణయాలకు ఆయన పెట్టుబడులే కారణమని ఇప్పటివరకు నిరూపితం కాలేదు. అధ్యక్షుడి ఆర్థిక ప్రయోజనాలపై పారదర్శక విచారణ జరగాలన్న డిమాండ్ మాత్రం బలపడుతోంది.

హైడ్రా పేరుతో

బెదిరింపులా?

- ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తా
- రాహుల్‌పై ఎంపీ ఈటల ధ్వజం

తెలంగాణలో తాగునీరు, సాగునీటి సమస్యలు పరిష్కరించకుండా భారత్ సమ్మిట్ పేరుతో విదేశీ ప్రతినిధులను ఆహ్వానించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈటల ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు లేని దేశాల ప్రతినిధులను హైదరాబాద్‌కు పిలవడం ఏం సాధిస్తుందని నిలదీశారు. రాహుల్‌గాంధీ విదేశీ వేదికలపై భారత ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం, పార్లమెంట్, సైనిక వ్యవస్థలపై విమర్శలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన అవినీతి కుంభకోణాలను ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడింది ఎవరో బహిరంగ చర్చకు రావాలని రాహుల్‌కు సవాల్ విసిరారు.

హైడ్రా చర్యలపై నిలదీత

ప్రభుత్వంపై ఆరోపణలు: హైడ్రా పేదల ఇళ్ల కూల్చివేతల పేరుతో బ్లాక్‌మెయిల్ చేయడానికే వచ్చిందని ఈటల ఆరోపించారు. దూలపల్లి, ఫాక్స్ సాగర్ ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ అనుమతులు, కోర్టు స్టేలు ఉన్నప్పటికీ చిన్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఇళ్లను కూల్చడం అన్యాయమన్నారు. ఫాక్స్ సాగర్ భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. రాష్ట్రంలో పనులకు 30 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని, రైతు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు అమలు కావడం లేదని విమర్శించారు. భూసేకరణలో మార్కెట్ విలువకు తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, ఈ ప్రభుత్వానికి మళ్లీ అధికారం దక్కదని ఈటల వ్యాఖ్యానించారు.





వెండితెరపై చెరగని ముద్ర

- నటుడు గిరిబాబు అస్తమయం

విలన్‌గా భయపెట్టి.. హాస్యంతో నవ్వించి.. క్యారెక్టర్ నటుడిగా మెప్పించి.. ఐదు దశాబ్దాల పాటు తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన నటుడు గిరిబాబు ఇక లేరు. రావినూతల నుంచి వెండితెర వరకు సాగిన ఆయన సినీ ప్రస్థానానికి కన్నీటి వీడ్కోలు పలికింది. 80 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. వయోభారంతో వచ్చిన అనారోగ్య సమస్యలు ఆయనను దూరం చేశాయి. 'జగమే మాయ'తో మొదలైన నటనా ప్రయాణం 600కు పైగా చిత్రాల వరకు సాగింది. హీరోగా అడుగుపెట్టి విలన్‌గా తనదైన ముద్ర వేశారు. హాస్యనటుడిగా నవ్వులు పంచారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు ప్రాణం పోశారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నటుడు రఘుబాబుతో సహా ముగ్గురు సంతానాన్ని, అపారమైన సినీ అభిమానాన్ని వెనుకకు వదిలి వెళ్లిపోయారు. స్వగ్రామం రావినూతలలో ఆదివారం అంత్యక్రియలు జరగనున్నాయి. తెరపై ఎన్నో పాత్రల్లో కనిపించిన గిరిబాబు.. ఇక జ్ఞాపకాల తెరపై మాత్రమే మిగిలారు. తెలుగు చిత్రసీమ ఓ విలక్షణ నటుడిని కోల్పోయింది.



ఆసియా కప్ విజేత భారత్

- పాక్‌పై చివరి బంతికి విజయం

పాక్ గుండెల్లో గుబులు.. భారత కుర్రాళ్లలో పట్టుదల.. ఆఖరి బంతికి ఉత్కంఠకు అంతులేని ఉర్రూతలు! అల్ అమరాత్ మైదానంలో అద్భుతం ఆవిష్కృతమైంది. ఆసియా కప్ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ నిర్దేశించిన 338 పరుగుల భారీ లక్ష్యం.. ఓ దశలో 252 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచిన భారత్.. ఇక కప్పు చేజారినట్టేనని భావించిన వేళ యువ సంచలనం మోహిత్ ఉల్వా విధ్వంసం సృష్టించాడు. మనాల్ చౌహాన్‌తో కలిసి పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 35 బంతుల్లో 57 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. చౌహాన్ 47 పరుగులు చేసి వెనుదిరిగినా ఉల్వా వెనక్కి తగ్గలేదు. చివరి ఓవర్లో ఏడు పరుగులు కావాలి.. ఐదు బంతుల్లో ఐదు పరుగులే వచ్చాయి. చివరి బంతికి మూడు పరుగులు అవసరం. కోట్లాది భారతీయుల గుండెలు ఆగినంత పని. ఉల్వా లాంగాఫ్ మీదుగా బంతిని బౌండరీ దాటించడంతో భారత్ ఒక్క వికెట్ తేడాతో సంచలన విజయం సాధించింది. 339 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించి ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది. అంతకు ముందు పాక్ 337 పరుగులు చేయగా, కావ్య పటేల్ నాలుగు, వెంకట మూడు వికెట్లతో కట్టడి చేశారు. ఓటమి అంచు నుంచి విజయ శిఖరానికి.. చివరి బంతి వరకు సాగిన ఈ పోరాటం అండర్ 19 క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది!

నెహ్రూ ఆశయాలే నవభారత నిర్మాణానికి పునాదులు!

దక్షిణాదిన నెహ్రూవియన్ భావజాల విస్తరణ: భట్టి



భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలే ఆధునిక భారత నిర్మాణానికి పునాదులని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రారంభమైన సౌత్ ఇండియా నెహ్రూ సెంటర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వా మ్యం, లౌకిక వాదం, శాస్త్రీయ ఆలోచనా విధా నం సమాజ పురోగతికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. నెహ్రూ స్వాతంత్ర్య పోరాటంలో చేసిన త్యాగాలు, సుమారు 13 ఏళ్ల జైలు జీవితం, దేశ ఐక్యత కోసం చేపట్టిన కార్యక్రమాలను గుర్తుచేశారు. తెలంగాణతో పాటు దక్షిణా ది రాష్ట్రాల్లో నెహ్రూవియన్ భావజాల విస్తర ణకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశా రు. ఈ కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్ ను అభినం దించారు.

విద్యా, పారిశ్రామిక ప్రగతికి పునాదులు

స్వాతంత్ర్యం తర్వాత దేశ ఆర్థిక, ఆహార సమస్యల పరిష్కారానికి నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు, అలీన విధానంతో అభివృద్ధికి దిశా నిర్దేశం చేశారని భట్టి వివరించారు. ఐఐటీలు, ఐఐఎంలు, యూజీసీ, పరిశోధనా సంస్థలు, ఉక్కు కర్మాగారాలు, నాగార్జున సాగర్, భాక్రా నంగల్, హీరాకుడ్ ప్రాజెక్టులు దేశ పురోగతికి పునాదులయ్యాయని తెలిపారు. పిల్లల భవిష్యత్తుపై నెహ్రూ చూపిన శ్రద్ధకు గుర్తుగా బాలల దినోత్సవం జరుపుకుంటున్నాము న్నారు. తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, 65కు పైగా స్కూళ్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, సంక్షేమ విద్యాసంస్థల్లో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 25 శాతం పెంచిందన్నారు. వాస్తవా లను యువతకు అందించాలని సూచించా రు. నెహ్రూ భావజా లాన్ని విస్తరించే వేదికగా ఈ కేంద్రం ఎదగాలని ఆకాంక్షించారు.

కొత్త ఆలోచనల వేదిక తెలంగాణ

అవర్ వరల్డ్ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ థింక్‌ట్యాంక్

డిసెంబర్ 7 నుంచి తెలంగాణ రైజింగ్ సమ్మిట్

ప్రపంచ సమస్యలపై పరిశోధనలకు కేంద్రం: శ్రీధర్ బాబు



అంతర్జాతీయ అంశాలపై పరిశోధనలు, విధానపరమైన చర్చలు, ప్రపంచ సమస్యలకు పరిష్కారాల అన్వేషణ లక్ష్యంగా 'అవర్ వరల్డ్ ఇన్ స్టిట్యూట్ 'ను శక్తిమంత మైన గ్లోబల్ థింక్ ట్యాంక్ గా తీర్చిదిద్దుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ హెచ్ ఐసీసీలో జరిగిన భారత్ సమ్మిట్-2026 ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఆలోచనలకు కార్యరూపం ఇచ్చే దిశగా ఈ సంస్థను ప్రారంభించామని చెప్పారు. సమ్మిట్ లో 12 అంతర్జాతీయ ప్యానెల్స్, హైటెక్స్ లో 8 తెలంగాణ రైజింగ్ సెషన్లు నిర్వహించినట్లు వెల్లడించారు. ఏఐ, ప్రపంచ ఆర్థిక సమానత్వం, వాతావరణ మార్పులు, శాంతి, మీడియా భవిష్యత్తు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై చర్చలు జరిగాయని వివరించారు.

అభివృద్ధితో పాటు సామాజిక న్యాయమే లక్ష్యం

భిన్నమైన అభిప్రాయాల మధ్య కూడా సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు, మానవీయ దృక్పథంతో ప్రపంచాన్ని నిర్మించాలనే ఆకాంక్ష సమ్మిట్‌లో వ్యక్తమైందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. భారత్ సమ్మిట్ తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపుతో పాటు బాధ్యతను కూడా తీసుకొచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రజల ఆత్మగౌరవం సమాంతరంగా ముందుకు సాగవచ్చని తెలంగాణ చాటుతోందని చెప్పారు. ఈ సందర్భంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0'కు దేశ, విదేశాల ప్రతినిధులు హాజరుకావాలని మంత్రి ఆహ్వానించారు.

సోనియా ఆత్మకథ.. పుస్తక పరిచయం



విజయవాడలో కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ రచించిన 'Belonging: A Journey of Love' ఆత్మకథ పుస్తక పరిచయ కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీరామ ప్యాలెస్‌లో నిర్వహించిన ఈ సభకు మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, సీనియర్ జర్నలిస్టు ఆర్. దిలీప్‌రెడ్డి, సీపీఎం నేతలు, విద్యా, సాహిత్య రంగాల ప్రముఖులు హాజరయ్యారు. సోనియా ఆత్మకథ ప్రచురణను అడ్డుకునేందుకు ప్రింటర్లు, పబ్లిషర్లను బెదిరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని గిడుగు రుద్రరాజు విమర్శించారు. ఇటలీ నుంచి భారత్‌కు వచ్చిన సోనియా ఆరు దశాబ్దాల ప్రయాణం, రాజకీయ సవాళ్లు, వ్యక్తిగత కష్టాలు, త్యాగాలు ఈ పుస్తకంలో ప్రతిబింబించాయని వక్తలు పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ మరణం తర్వాత ప్రధాన మంత్రి పదవిని స్వీకరించకుండా వదులుకున్న ఆమె నిర్ణయాన్ని ప్రస్తావించారు. నెహ్రూ కుటుంబం దేశ నిర్మాణానికి చేసిన సేవలను రఘువీరారెడ్డి గుర్తుచేశారు. సోనియా జీవిత ప్రయాణం, ప్రజాసేవ, త్యాగాలు భావితరాలకు స్ఫూర్తినిస్తాయని సభలో పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు.

వృద్ధుల ఆరోగ్యానికి అండగా రోటరీ క్లబ్



ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమ్మా నాన్న వృద్ధాశ్రమంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితులను వైద్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా మధుమేహం, బీపీ సమస్యలపై అవగాహన కల్పిస్తూ నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

అనంతరం వృద్ధులకు ఆరోగ్య సూచనలు అందించి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ శర్మ, రొటేరియన్లు గజ్జల వెంకటేశ్వరరెడ్డి, జి.వి. రమణాచారి తదితరులు పాల్గొని వృద్ధులకు సేవలందించారు.



బీటెక్ రవి సమక్షంలో టీడీపీలోకి 20 కుటుంబాల చేరిక

వేముల: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వేముల మండలం భూమయ్యగారిపల్లెకు చెందిన మాజీ సర్పంచి, మాజీ ఎంపీటీసీ, మాజీ జడ్పీటీసీ భూమిరెడ్డి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పేర్ల పార్థ సారథిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి సమక్షంలో బీటెక్ రవి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో యువతకు లభిస్తున్న ప్రోత్సాహం, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి తమను ఆకర్షించాయని నూతనంగా పార్టీలో చేరిన వారు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

స్పై కెమెరా కళ్లజోడుతో ఆలయంలోకి వెళ్లిన భక్తుడు

దక్షిణ కాశీ శ్రీకాళహస్తి ఆలయంలో భద్రతా లోపం కలకలం రేపింది. లడ్డూ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం ఘటన మరువకముందే, స్పై కెమెరా అమర్చిన కళ్లజోడుతో ఓ భక్తుడు అమ్మవారి గర్భాలయం వరకు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. పూణేకు చెందిన అంకేష్ అగర్వాల్ శుక్రవారం కుటుంబంతో వచ్చి రాహుకేతు పూజ అనంతరం స్వామివారిని దర్శించుకున్నాడు. ఆ తర్వాత అమ్మవారి గర్భాలయంలోకి వెళ్లగా, అతడి కళ్లజోడుపై అనుమానం వచ్చిన పూజారి పరిశీలించి వీడియో రికార్డింగ్ కెమెరాను గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. మెటల్ డిటెక్టర్లు, స్కానింగ్ ఉన్నా పరికరం లోపలికి ఎలా చేరిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్వామివారి ఆలయంలోనూ చిత్రీకరణ జరిగిందా అనే కోణంలో విచారణ సాగుతోంది.



బాలల భద్రతే మా ప్రాధాన్యత: సీతక్క

ప్రతి చిన్నారి భద్రత, ఆరోగ్యం, విద్య సమాజ సమష్టి బాధ్యతని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన వేడుకల్లో పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. అంగన్ వాడీలను ప్రీప్రైమరీ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడంతో పాటు అల్పాహార పథకాన్ని మరో పది జిల్లాలకు విస్తరిస్తామని ప్రకటించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని, మొబైల్ వ్యసనానికి పిల్లలను దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. ఏఐ ఆధారిత హాజరు, ఎదుగుదల పర్యవేక్షణ వ్యవస్థలను ప్రారంభించారు. ఆరు జిల్లాల్లో కొత్త దత్తత కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో వాటి సంఖ్య 23కు చేరింది. నాలుగు బస్ స్టాండ్లలో చైల్డ్ హెల్ప్ డెస్క్ లు ప్రారంభించారు. 1098 హెల్ప్ లైన్ ను 112తో అనుసంధానించారు. బాలల రక్షణలో రాజీ ఉండదని మంత్రి హెచ్చరించారు.

ప్రపంచ పెట్టుబడులకు ఆహ్వానం!

రాష్ట్ర అవకాశాలను ప్రపంచానికి చాటండి

విదేశీ ప్రతినిధులకు మంత్రి ఉత్తమ్ పిలుపు




తెలంగాణలో అపారంగా ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని విదేశీ ప్రతినిధులకు మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లో జరిగిన భారత్ సమ్మిట్-2026 ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ సంస్థలు, వ్యాపారవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రోత్సహించాలని కోరారు. హైదరాబాద్ ఆవిష్కరణలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు కీలక కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రతినిధులు తమ దేశాల్లోని పెట్టుబడిదారులను తెలంగాణతో అనుసంధానించి, దీర్ఘ కాలిక భాగస్వామ్యాలకు బాటలు వేయాలన్నారు

ప్రపంచ సమస్యలపై విస్తృత చర్చలు

'ఫోర్జింగ్ ఎ న్యూ వరల్డ్' ఇతివృత్తంతో జరిగిన సమ్మిట్ లో కృత్రిమ మేధ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాతావరణ మార్పులు, యువత పాత్ర, లింగ సమానత్వం, ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛపై చర్చలు జరిగాయని ఉత్తమ్ తెలిపారు. రాహుల్ గాంధీ పాల్గొనడం సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, దేశ వైవిధ్యంపై ఆయన ప్రస్తావించిన అంశాలను వివరించారు. విదేశీ ప్రతినిధులు తమ దేశాలకు వెళ్లాక తెలంగాణలోని అవకాశాలను ప్రచారం చేయాలని కోరారు. పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

తిరుచానూరు ఆలయంలో మహిళా భక్తులకు తప్పని అవస్థలు!



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నా కనీస సౌకర్యాలు కరువవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆలయ లడ్డూ కౌంటర్ సమీపంలోని మరుగుదొడ్ల దుస్థితి మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కొన్ని మరుగుదొడ్లకు తలుపులు లేకపోగా, మరికొన్నింటికి గడియలు కూడా లేవు. దీంతో కనీస వ్యక్తిగత గోప్యత లేక మహిళా భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి దర్శనం చేసుకునే వృద్ధులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు ఈ సమస్య మరింత భారంగా మారింది. కోట్లాది రూపాయల ఆదాయం పొందుతున్న టీటీడీ భక్తులకు కనీస వసతులు కల్పించలేదా అని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మరుగుదొడ్లకు తలుపులు, గడియలు ఏర్పాటు చేయడంతో పాటు పరిశుభ్రతను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల అక్రమాలపై వైసీపీ ఫిర్యాదు!



తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన అభినయ్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు మహిళలపై దాడులకు పాల్పడటం, నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థులపై దాడులు చేసి గాయపరచడం, నామినేషన్ పత్రాలను చించివేయడం వంటి ఘటనలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ స్క్రూటినీ పేరుతో నామినేషన్లు తిరస్కరించారని ఆరోపించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయంటూ సీఎం చంద్రబాబు చెప్పడం విడ్డూరమని బియ్యపు మధుసూదన్ రెడ్డి విమర్శించారు. వైసీపీ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణలో జనసేన మహిళా శక్తికి ప్రాధాన్యం



తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతానికి మహిళా శక్తిని సమీకరించే దిశగా మాదాపూర్ లోని జూబ్లీ రిడ్జ్ లో వీరమహిళల ఆత్మీయ సమావేశం ప్రారంభమైంది. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ భేటీకి పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ ఇన్ ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్ .కె. సాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళా కార్యకర్తలు తరలివచ్చారు. <

పార్టీ సంస్థాగత విస్తరణ, నాయకత్వ బాధ్యతల్లో మహిళలకు ప్రాధాన్యం, భవిష్యత్ కార్యాచరణపై నేతలు వారితో ముఖాముఖి చర్చిస్తున్నారు. వీరమహిళల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేలా రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశం చేయనుంది.

పులివెందుల హాకీ టర్ఫ్‌పై జాతీయస్థాయి కలలకు రెక్కలు



పులివెందులలోని వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో 70వ ఎస్ జేఎఫ్ ఏపీ అంతర్ జిల్లాల అండర్19 హాకీ టోర్నమెంట్ 202627 ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు జగిత్యాలలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించిన పులివెందుల హాకీ టర్ఫ్ మైదానం అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకుందని వివరించారు. అంతర్జాతీయ హాకీ మ్యాచ్ లు నిర్వహించగల సామర్థ్యం ఈ మైదానానికి ఉందన్నారు. క్రీడాకారులకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా సదుపాయాలు స్థానికంగానే లభించడం యువ ప్రతిభకు ఎంతో ప్రోత్సాహమని అన్నారు.


డెలివరీ బాయ్ అవతారంలో మంత్రి వివేక్!

గిగ్ వర్కర్ల కష్టాలు తెలుసుకునే ప్రయత్నం



గిగ్ వర్కర్ల బైక్ ర్యాలీ ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి డెలివరీ బాయ్ వేషధారణలో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. సాధారణంగా అధికారిక హోదాలో కనిపించే మంత్రి, డెలివరీ సిబ్బంది తరహా దుస్తుల్లో రావడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక నుంచి హెచ్ ఐసీసీ సమీపంలోని జయభేరి గ్రౌండ్స్ వరకు నిర్వహించే భారీ బైక్ ర్యాలీ ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, ర్యాలీ మార్గం, భద్రత, ట్రాఫిక్, తాగునీరు, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కార్మికులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. లక్షలాది మంది గిగ్ వర్కర్లు ప్రజలకు సేవలందిస్తున్నారని, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడం ప్రభుత్వ బాధ్యతని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, కార్మికుల రిజిస్ట్రేషన్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వారికి సామాజిక భద్రత కల్పించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు.

మంత్రి దుర్గేష్‌తో వరదరాజుల రెడ్డి భేటీ



ప్రొద్దుటూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని కొవ్వూరు గ్రౌండ్‌కు చేరుకున్న మంత్రితో ఎమ్మెల్యే కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో టీడీపీ, జనసేన నాయకులు ఒకచోట చేరడంతో రాజకీయ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి చౌటపల్లి లక్ష్మిరెడ్డి, జనసేన నాయకులు సుంకర మురళి, మాదాసు మురళి, వంశీ శ్రీనివాసుల రెడ్డి, చిరంజీవి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. మంత్రిని ఎమ్మెల్యే మరాదపూర్వకంగా కలవడం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈ ఆత్మీయ కలయికతో ప్రొద్దుటూరు పర్యటనకు ప్రత్యేక సందడి ఏర్పడింది.

ఒక నాయకుడు ప్రజల్లోకి వచ్చినప్పుడు మొదట కనిపించేది ఆయన మాట కాదు.. చేతల్లోని పనులు అంతకంటే ముందుగా తెలియవు. తొలుత కనిపించేది ఆయన రూపం, ధరించిన దుస్తులు, నడిచే తీరు, ముఖంలో కనిపించే భావాలు. అందుకే రాజకీయాల్లో బాహ్యరూపానికి కూడా ప్రత్యేక స్థానం ఉంది. ఒకరి వ్యక్తిత్వాన్ని పూర్తిగా అంచనా వేయడానికి దుస్తులు ప్రమాణం కాకపోయినా, ప్రజల్లో తొలి అభిప్రాయాన్ని కలిగించడంలో మాత్రం అవి కీలక పాత్ర పోషిస్తాయి. నాయకుల వస్త్రధారణ వెనుక రాజకీయ సందేశాలు, వ్యక్తిగత అభిరుచులు, ప్రజలకు దగ్గరవ్వాలనే ప్రయత్నాలు ఎన్నో దాగి ఉంటాయి. తెలుగు రాష్ట్రాల రాజకీయాలను పరిశీలిస్తే ప్రతి నాయకుడికీ ఒక ప్రత్యేక రూపశైలి కనిపిస్తుంది. కొందరు నిరాడంబరతను తమ గుర్తింపుగా మార్చుకుంటే, మరికొందరు హుందాతనాన్ని తమ రాజకీయ బ్రాండ్‌గా నిలబెట్టుకున్నారు. ఇంకొందరు సంప్రదాయ దుస్తులతో ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య సాధారణ జీవితం గడుపుతూ సైకిల్‌పై అసెంబ్లీకి వచ్చిన రోజులు ఒకవైపు ఉంటే, దర్పంగా కనిపించే వస్త్రధారణతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నేతలు మరోవైపు ఉన్నారు. ఎన్టీఆర్ నుంచి వైఎస్సార్ వరకు, చంద్రబాబు నుంచి కేసీఆర్ వరకు, జగన్ నుంచి రేవంత్ రెడ్డి, కేటీఆర్ వరకు ఒక్కొక్కరిదీ ఒక్కో శైలి. వీరి దుస్తులు కేవలం వ్యక్తిగత ఇష్టాలకు సంబంధించినవి మాత్రమే కాదు.. ఆయా సందర్భాల్లో ప్రజలకు చేరవేయాలనుకున్న రాజకీయ సందేశాలకు కూడా ప్రతీకలుగా నిలిచాయి. నాయకుడు ఎలా కనిపించాలనే అంశంపై ఇప్పుడు మరోసారి చర్చ మొదలైంది. అందుకు కారణం తెలంగాణ రాజకీయాల్లో చోటుచేసుకున్న కేటీఆర్ గడ్డం వ్యవహారం. ఇన్నాళ్లూ క్లాస్ లుక్‌తో కనిపించిన నాయకుడు ఒక్కసారిగా మాస్ రూపంలోకి మారితే రాజకీయ ప్రత్యర్థులు ఊరుకుంటారా? ఆ మార్పు వెనుక వ్యూహం ఉందా? ప్రజలకు మరింత చేరువ కావాలనే ప్రయత్నమా? లేక వ్యక్తిగత అభిరుచిలో వచ్చిన మార్పా? ఈ ప్రశ్నల చుట్టూ తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.





- నేతల లుక్ వెనుక రాజకీయ లెక్కలెన్నో !
- మాస్ లుక్ కోసమే కేటీఆర్ మేకోవర్!
- రేవంత్ రెడ్డికి అస్త్రాన్ని అందించారా ?
- నేతల ఆహార్యం ఓట్లు కురిపిస్తుందా ?

• కేటీఆర్ కొత్త లుక్.. మాస్ ఇమేజ్ కోసమేనా?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంటే ఇప్పటివరకు చాలామందికి గుర్తుకొచ్చేది చక్కగా గడ్డం తీసిన ముఖం, మీసాలు లేకుండా కనిపించే రూపం, ఆకట్టుకునే డ్రెస్సింగ్. సభల్లోనైనా, మీడియా సమావేశాల్లోనైనా, విదేశీ పర్యటనల్లోనైనా ఆయన ఎక్కువగా క్లాస్ లుక్‌కే ప్రాధాన్యం ఇచ్చేవారు. కానీ ఇటీవల కొద్దిరోజుల పాటు ఇంటికే పరిమితమైన కేటీఆర్ ఒక్కసారిగా గడ్డం పెంచిన కొత్త రూపంలో కనిపించారు. ఇన్నాళ్లూ చూసిన రూపానికి భిన్నంగా ఆయన దర్శనమివ్వడంతో అభిమానులు సైతం ఆశ్చర్యపోయారు. కొత్త లుక్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా గడ్డం పెంచడం వ్యక్తిగత నిర్ణయం. అందులో రాజకీయాలను వెతకాల్సిన అవసరం లేదు. అయితే ప్రజల్లో నిరంతరం కనిపించే నాయకుడి విషయంలో చిన్న మార్పు కూడా పెద్ద చర్చకు దారితీస్తుంది. కేటీఆర్ విషయంలోనూ అదే జరిగింది. ఆయన కొత్త రూపాన్ని చూసి కొందరు అభిమానులు మాస్ లుక్ అంటుంటే, ప్రత్యర్థులు మాత్రం విమర్శలకు దిగారు. కేటీఆర్ తన రూపాన్ని మార్చుకోవడం వెనుక ప్రజల్లో కొత్త గుర్తింపు సంపాదించాలనే ఆలోచన ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు క్లాస్ నాయకుడిగా కనిపించిన ఆయన, సాధారణ ప్రజలకు మరింత చేరువయ్యే రూపంలో కనిపించాలని భావించారా? రాజకీయంగా ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో తన ఇమేజ్‌ను కొత్తగా తీర్చిదిద్దుకోవాలనుకుంటున్నారా? అన్న చర్చ కూడా సాగుతోంది. రాజకీయాల్లో రూపం మారితే దాని వెనుక వ్యూహం ఉందని భావించడం సహజమే. అయితే కేటీఆర్ గడ్డం పెంపుపై ఆయన నుంచి స్పష్టమైన రాజకీయ వివరణ రాకముందే అనేక అంచనాలు తెరపైకి వచ్చాయి. అధికార పక్షానికి చెందిన సోషల్ మీడియా వర్గాలు ఈ మార్పును లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశాయి. అయినప్పటికీ కేటీఆర్ తన కొత్త రూపాన్ని కొనసాగిస్తున్నారు. ఒకప్పుడు నున్నటి ముఖంతో కనిపించిన నాయకుడు ఇప్పుడు గడ్డంతో కనిపించడం ఆయన అభిమానులకు కొత్త అనుభూతిని కలిగిస్తోంది. అయితే ఈ రూపాంతరం ఓట్లను ఆకర్షిస్తుందా? ప్రజల్లో మాస్ ఇమేజ్‌ను పెంచుతుందా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఎందుకంటే రాజకీయ నాయకుడికి కొత్త లుక్ ప్రచారంలో ఆకర్షణ కలిగించవచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని సంపాదించడానికి అంతకంటే బలమైన కారణాలు అవసరం.

• రేవంత్ కౌంటర్.. గడ్డం వెనుక రాజకీయ గరం!

కేటీఆర్ కొత్త రూపంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు ప్రారంభించడంతో ఈ వ్యవహారం మరింత రాజకీయ రంగు పులుముకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో స్పందిస్తూ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. నల్లమల పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా కేటీఆర్ తనను చూసి గడ్డం పెంచుతున్నారనే వ్యాఖ్యలతో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మోకాళ్ల వరకు గడ్డం పెంచినా తనలా మారలేరంటూ తన మాస్ ఇమేజ్‌ను ప్రస్తావించారు. దీంతో గడ్డం వ్యవహారం కేవలం వ్యక్తిగత రూపమార్పు దగ్గర ఆగకుండా రాజకీయ విమర్శల అంశంగా మారింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు నిర్మల్ సభలో కేటీఆర్ స్పందించారు. తన గడ్డం గురించి జరుగుతున్న ప్రచారంపై తొలిసారి మాట్లాడిన ఆయన, ఎవరైనా రేవంత్ రెడ్డిలా కనిపించాలని అనుకుంటారా? అంటూ ఎదురుదాడి చేశారు. దీంతో ఇరువురు నేతల మధ్య మాటల యుద్ధానికి కొత్త అంశం దొరికినట్లయింది. నిజానికి గడ్డం పెంచుకోవడం ఎవరి వ్యక్తిగత నిర్ణయమైనా కావచ్చు. దానిపై అభ్యంతరం చెప్పడానికి ఎవరికీ ప్రత్యేక హక్కు లేదు. కానీ రాజకీయ ప్రత్యర్థులు ఒకరి రూపాన్ని మరొకరు విమర్శించుకోవడంతో ఈ అంశం ప్రజల్లో చర్చకు వచ్చింది. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం కూడా ఉంది. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి గడ్డం పెంచినప్పుడు బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఉత్తమ్ గడ్డంపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. గడ్డం పెంచితే గుడ్డిలుగులా కనిపిస్తావంటూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. ఇప్పుడు కేటీఆర్ గడ్డం పెంచడంతో కాంగ్రెస్ నేతలు అదే పాత వ్యాఖ్యలను గుర్తుచేస్తున్నారు. తండ్రి చేసిన విమర్శలనే ఇప్పుడు కుమారుడికి రాజకీయ ప్రత్యర్థులు గుర్తుచేయడం ఈ వ్యవహారంలో మరో ఆసక్తికరమైన మలుపు. ఒకప్పుడు ప్రత్యర్థి గడ్డంపై విమర్శలు చేసిన పార్టీ నాయకుడే ఇప్పుడు గడ్డం పెంచడం రాజకీయ వ్యంగ్యానికి అవకాశం కల్పించింది. ఇదిలా ఉంటే రేవంత్ రెడ్డి కూడా తన వస్త్రధారణలో కొంత వైవిధ్యం చూపిస్తున్నారు. ఇటీవల దీపావళి సందర్భంగా తన నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో ఆయన ధరించిన పొడవాటి ఆపిల్ కట్ చొక్కా ప్రత్యేకంగా కనిపించింది. సాధారణంగా ఇలాంటి చొక్కాలను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎక్కువగా ధరిస్తుంటారు. ఇప్పుడు అదే తరహా చొక్కాల్లో రేవంత్ కనిపించడం కూడా చర్చకు దారితీసింది. ఒకరి గడ్డం, మరొకరి చొక్కా.. తెలంగాణ రాజకీయాల్లో రూపాల చుట్టూ సాగుతున్న ఈ చర్చ చివరకు నేతల వ్యక్తిగత శైలులపై ఆసక్తిని పెంచుతోంది.

• ఎన్టీఆర్ నుంచి వైఎస్సార్ వరకు.. దుస్తుల్లోనే ప్రత్యేక గుర్తింపు!

తెలుగు రాజకీయాల్లో వస్త్రధారణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన నాయకుల్లో ఎన్టీఆర్ పేరు ముందుగా చెప్పుకోవాలి. సినిమాల్లో అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా తన రూపశైలితో ప్రజలను ప్రభావితం చేశారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజల్లోకి వెళ్లినప్పుడు ఖాకీ చొక్కా, ఖాకీ ప్యాంటు ధరించి చైతన్య రథంపై పర్యటించారు. తాను పాలకుడిని కాదని, ప్రజలకు సేవకుడిననే సందేశాన్ని ఆ దుస్తుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కార్మికులు, కర్షకులకు దగ్గరవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎంచుకున్న ఈ రూపం అప్పట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధికారంలోకి వచ్చిన తర్వాత భార్య బసవతారకం మరణంతో ఎన్టీఆర్ కాషాయ వస్త్రధారణను స్వీకరించి, గుండు చేయించుకున్నారు. కొంతకాలం అదే రూపాన్ని కొనసాగించారు. మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి వస్తే గుర్తొచ్చేది తెల్లటి పంచెకట్టు. పక్కా తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించే పంచెకట్టులో ఆయన రైతన్నలా కనిపించేవారు. వైద్యుడిగా ఉన్నప్పుడు అప్పుడప్పుడు సూట్, బూట్ ధరించినా రాజకీయ జీవితంలో మాత్రం ఎక్కువగా తెల్ల పంచె, చొక్కాకే ప్రాధాన్యం ఇచ్చారు. పాదయాత్ర సమయంలోనూ అదే రూపంతో ప్రజల్లోకి వెళ్లారు. రైతులతో కలిసి నడిచే నాయకుడిగా, వారి కష్టాలు తెలిసిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు రావడంలో ఈ సంప్రదాయ వస్త్రధారణ కూడా కొంత పాత్ర పోషించింది. ఇప్పుడు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సైతం ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తుంటారు. పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబర జీవనశైలి మరో ప్రత్యేక అధ్యాయం. సామాన్యుడిలా సైకిల్‌పై ప్రయాణిస్తూ ప్రజాజీవితంలో ఆదర్శంగా నిలిచారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి వంటి నాయకులు మాత్రం హుందాతనంతో కూడిన రూపానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ రెండు విభిన్న శైలులు తెలుగు రాజకీయాల్లో కనిపించే వైవిధ్యానికి నిదర్శనం. చంద్రబాబు నాయుడి విషయానికి వస్తే ఆయనది ప్రత్యేకమైన రాజకీయ కార్పొరేట్ లుక్. తెల్లటి ఖద్దరు చొక్కా, ప్యాంటు, చిన్నగా కనిపించే గడ్డం ఆయన రూపంలో స్థిరమైన భాగాలుగా మారాయి. దేశీయ పర్యటనల్లోనే కాదు, ఎముకలు గడ్డకట్టే స్విట్జర్లాండ్ వంటి చలి ప్రాంతాల్లోనూ, అమెరికా పర్యటనల్లోనూ తన సాధారణ వస్త్రధారణకు పెద్దగా మార్పులు చేయరు. విదేశాలకు వెళ్లినప్పుడు చాలామంది నాయకులు సూటు, బూటు ధరిస్తే చంద్రబాబు మాత్రం తన ఖద్దరు దుస్తులకే ప్రాధాన్యం ఇస్తారు. పసుపు లేదా లేత పసుపు రంగు చొక్కాలు ధరించడం ద్వారా పార్టీ రంగుతోనూ తన రూపాన్ని అనుసంధానిస్తారు. ఆయన వస్త్రశైలి ఒక క్రమశిక్షణతో కూడిన రాజకీయ గుర్తింపుగా కొనసాగుతోంది.

• కేసీఆర్ ఖద్దరు.. జగన్ తెల్లచొక్కా.. మోదీ జాకెట్!

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ వస్త్రధారణకు ప్రత్యేక స్థానం ఉంది. కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో నెహ్రూ సూట్‌లో కనిపించిన ఆయన, తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తర్వాత ఎక్కువగా తెల్లటి ఖద్దరు దుస్తులకే పరిమితమయ్యారు. పొందూరు ఖద్దరుతో తయారైన ఫుల్ హ్యాండ్ తెల్ల చొక్కాలు ఆయన రూపంలో అంతర్భాగమయ్యాయి. తెలంగాణ ఉద్యమంలోనూ, పదేళ్ల ముఖ్యమంత్రి పాలనలోనూ ఇదే శైలిని కొనసాగించారు. తనకు ముప్పై ఏళ్లుగా దుస్తులు కుట్టిస్తున్న హైదర్‌గూడలోని సాయి ఖాదీ వస్త్రాలయానికి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెళ్లడం ద్వారా ఆ సంస్థపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అయితే ఫాంహౌస్‌లో ఉన్నప్పుడు లేదా ఎండలో పర్యటించే సందర్భాల్లో మాత్రం ప్రత్యేకమైన టోపీ ధరిస్తారు. కౌబాయ్ టోపీగా, అమెరికన్ రైతుల టోపీగా పిలిచే ఆ ప్రత్యేక రూపం ఎండ నుంచి రక్షణ కల్పించడంతోపాటు కేసీఆర్ వ్యక్తిగత గుర్తింపుగా మారింది. ఇక వైసీపీ అధినేత వైఎస్ జగన్ విషయానికి వస్తే ఆయనకు తెల్లటి చొక్కాలంటే ప్రత్యేకమైన ఇష్టం. ఫుల్ హ్యాండ్ షర్టులను మోచేతుల వరకు మడిచి ధరించడం ఆయనకు అలవాటు. క్రీమ్ రంగు ప్యాంట్లతో కలిపి తెల్లటి కాటన్, లినెన్ చొక్కాలు వేసుకుంటారు. రాజకీయాల్లోకి వచ్చిన ప్రారంభంలో విభిన్న రంగుల దుస్తులు ధరించినప్పటికీ తర్వాత పూర్తిగా తెల్లచొక్కా శైలికి ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన చొక్కాల్లో ఆపిల్ కట్ డిజైన్లు ఎక్కువగా కనిపిస్తాయి. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అలాంటి చొక్కాలతో కనిపిస్తుండటంతో ఈ శైలి మరోసారి చర్చల్లోకి వచ్చింది. జాతీయ రాజకీయాల్లో ప్రధాని నరేంద్ర మోదీ వస్త్రధారణ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. వివిధ రంగుల్లో కుర్తాలు ధరించే ఆయన, వాటిపై వేసుకునే స్లీవ్‌లెస్ జాకెట్‌ను ప్రత్యేక గుర్తింపుగా మార్చుకున్నారు. అదే ఇప్పుడు మోదీ జాకెట్‌గా ప్రసిద్ధి చెందింది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి సందర్భాల్లో వివిధ ప్రాంతాల సంప్రదాయాలను ప్రతిబింబించే తలపాగాలు ధరిస్తారు. దేశంలోని భిన్న ప్రాంతాల వస్త్ర సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసేలా ఆయన రూపశైలిలో వైవిధ్యం కనిపిస్తుంది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒకప్పుడు కుర్తా పైజామాలో ఎక్కువగా కనిపించేవారు. ప్రస్తుతం తెల్లటి టీషర్ట్, ప్యాంటుతో ప్రజల్లోకి వెళ్తున్నారు. చలి ప్రాంతాల పర్యటనల్లోనూ టీషర్ట్‌తో కనిపించిన సందర్భాలు ఆయన వస్త్రధారణను చర్చనీయాంశం చేశాయి. యోగి ఆదిత్యనాథ్ కాషాయ వస్త్రాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నీలం అంచున్న తెల్లచీర ఆమె ప్రత్యేక గుర్తింపులుగా మారాయి. ఇలా దేశవ్యాప్తంగా నేతలు తమదైన వస్త్రశైలితో ప్రజల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటున్నారు.



లుక్ ఆకర్షించవచ్చు.. అధికారం మాత్రం పనులతోనే!

రాజకీయాల్లో నాయకులు ఎలా కనిపించాలనే అంశం ఎప్పుడూ ఆసక్తికరమే. ఎందుకంటే ప్రజల ముందుకు వెళ్లే ప్రతి సందర్భంలోనూ నాయకుడి రూపం ఒక సందేశాన్ని ఇస్తుంది. సంప్రదాయ దుస్తులు ధరించడం ద్వారా సంస్కృతిని గుర్తుచేయవచ్చు. ఖద్దరు వేసుకోవడం ద్వారా నిరాడంబరతను చాటుకోవచ్చు. ప్రత్యేకమైన జాకెట్లు, చొక్కాలు, గడ్డం వంటి మార్పులతో కొత్త గుర్తింపును సృష్టించుకోవచ్చు. కానీ ఇవన్నీ ప్రజలను ఆకర్షించడానికి ఉపయోగపడే సాధనాలు మాత్రమే. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, సమస్యలను పరిష్కరించడం, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం, అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అంశాలే నాయకుడి అసలైన స్థాయిని నిర్ణయిస్తాయి. ఒక నాయకుడు ఎంత అందంగా కనిపించినా ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ఆ ఆకర్షణ ఎక్కువకాలం నిలవదు. మరో నాయకుడు సాధారణ దుస్తుల్లో కనిపించినా ప్రజల కోసం పనిచేస్తే వారి మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించుకుంటారు. అందుకే సుందరయ్య నిరాడంబరత ఇప్పటికీ గుర్తుండగా, ఎన్టీఆర్ ఖాకీ దుస్తులు రాజకీయ చరిత్రలో ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి. వైఎస్సార్ పంచెకట్టు ప్రజలకు ఆయనను దగ్గర చేస్తే, కేసీఆర్ తెల్ల ఖద్దరు తెలంగాణ రాజకీయాల్లో ఒక ప్రత్యేక శైలిగా నిలిచింది. చంద్రబాబు స్థిరమైన వస్త్రధారణ, జగన్ తెల్లచొక్కా, మోదీ జాకెట్, రాహుల్ టీషర్ట్.. ఇవన్నీ ఆయా నాయకుల వ్యక్తిగత గుర్తింపులో భాగమయ్యాయి. ఇప్పుడు కేటీఆర్ గడ్డం, రేవంత్ చొక్కా కూడా ఇదే చర్చలో చేరాయి. అయితే ఈ ఇద్దరు నేతల మధ్య సాగుతున్న రూపాల రాజకీయాలు మరో ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. నాయకులు ప్రజలకు నచ్చేలా కనిపించాలా? లేక ప్రజలకు నచ్చేలా పనిచేయాలా? మాస్ లుక్ ఓట్లను తెస్తుందా? క్లాస్ ఇమేజ్ అధికారాన్ని అందిస్తుందా? అన్న ప్రశ్నలకు ఎన్నికల ఫలితాలే సమాధానం చెబుతాయి. రాజకీయాల్లో ప్రత్యర్థిని విమర్శించడం సులభం. అతని గడ్డాన్ని, చొక్కాను, రూపాన్ని ఎగతాళి చేయడం ఇంకా సులభం. కానీ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం మాత్రం అంత తేలిక కాదు. ఒక నాయకుడి వస్త్రధారణ వార్త కావచ్చు. గడ్డం రాజకీయ చర్చకు కేంద్రబిందువు కావచ్చు. కొత్త చొక్కా సోషల్ మీడియాలో వైరల్ కావచ్చు. కానీ ప్రజలు చివరకు గుర్తుపెట్టుకునేది తమ కష్టకాలంలో ఎవరు అండగా నిలిచారు? తమ ప్రాంతానికి ఎవరు అభివృద్ధి తీసుకొచ్చారు? తమకు ఇచ్చిన మాటను ఎవరు నిలబెట్టుకున్నారు? అన్న విషయాలనే. రూపం తొలి ఆకర్షణ కావచ్చు.. పనితీరే అసలైన రాజకీయ అర్హత. దుస్తులు గుర్తింపునిస్తాయి.. ప్రజాసేవ చరిత్రను సృష్టిస్తుంది. గడ్డం పెంచితే మాస్ ఇమేజ్ రావచ్చు.. చొక్కా మార్చితే కొత్త లుక్ రావచ్చు.. కానీ ప్రజల మనసు గెలిచినప్పుడే అధికార పీఠం దక్కుతుంది.

- గుంటుక చక్రవర్తి, సీనియర్ జర్నలిస్ట్





విజయ గర్జన

ఐదు జాతీయ అవార్డులతో జయకేతనం

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐకేఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్ జాతీయ ఆర్థిక రంగంలో తన ప్రత్యేకతను చాటుకుంది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) విభాగంలో ఒకేసారి ఐదు జాతీయ పురస్కారాలను అందుకుని విశేష గుర్తింపు సాధించింది. ముంబైలోని హోటల్ ఆర్కిడ్‌లో నవంబరు 13న బ్యాంకింగ్, ఆర్థిక రంగానికి చెందిన ప్రముఖ పత్రిక 'బ్యాంకింగ్ ఫ్రాంటియర్స్' నిర్వహించిన 'ఎన్‌బీఎఫ్‌సీస్ టుమారో కాన్‌క్లేవ్ అండ్ డీఎన్‌ఏ అవార్డ్స్-2026' కార్యక్రమంలో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఆర్థిక నిర్వహణ, మానవ వనరుల అభివృద్ధి, రిస్క్ నిర్వహణ వంటి కీలక విభాగాల్లో సంస్థ కనబరిచిన ప్రతిభకు ఈ అవార్డులు దక్కాయి. ఒకే సంస్థకు మూడు విభాగాల్లో ఐదు పురస్కారాలు రావడం ఐకేఎఫ్ సాధించిన విజయానికి నిదర్శనంగా నిలిచింది. సంస్థ తరపున చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రఘురామ్ కొత్తమర్తి, చీఫ్ రిస్క్ ఆఫీసర్ చక్రపాణి గొల్లమూడి అవార్డులను అందుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ఎన్‌బీఎఫ్‌సీలకు చెందిన ఉన్నతాధికారులు, ఆర్థిక రంగ నిపుణులు పాల్గొన్న ఈ సదస్సులో సంస్థల భవిష్యత్తు, మారుతున్న ఆర్థిక పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై విస్తృత చర్చలు జరిగాయి. నాయకత్వ సంభాషణ నైపుణ్యాలపై ప్రత్యేక ప్యానెల్ చర్చ నిర్వహించారు. ఉద్యోగులు, వ్యాపార భాగస్వాముల సామర్థ్యాలను పెంచడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించడం, డేటా విశ్లేషణతో పాటు కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, ఉన్నతాధికారుల నిర్ణయాలకు ఉపయోగపడే డ్యాష్‌బోర్డుల రూపకల్పన వంటి అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. మారుతున్న ఆర్థిక రంగంలో పోటీని తట్టుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సంస్థలు అనుసరించాల్సిన వ్యూహాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ వేదికపై ఐకేఎఫ్ ఫైనాన్స్ సాధించిన గుర్తింపు సంస్థ పనితీరుకు జాతీయ స్థాయిలో లభించిన ప్రశంసగా నిలిచింది.











ఆర్థిక బలం.. ఉద్యోగుల ప్రతిభ, రిస్క్ విభాగాల్లో సత్తా

ఆర్థిక రంగంలో జాతీయ స్థాయిలో సంస్థకు గుర్తింపు

• మూలధన సమీకరణలో కొత్త రికార్డు.. రెండు పురస్కారాలు

ఐకేఎఫ్ ఫైనాన్స్‌కు ఆర్థిక విభాగంలో రెండు కీలక పురస్కారాలు లభించాయి. 2025 26 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఈక్విటీ పెరుగుదల సాధించిన సంస్థగా ఒక అవార్డు దక్కగా, ఈక్విటీతో పోలిస్తే అత్యధిక రుణ నిధులు సమీకరించిన సంస్థగా మరో పురస్కారం లభించింది. సంస్థ 35 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నడూ లేనివిధంగా రూ.749.49 కోట్ల ఈక్విటీ మూలధనాన్ని సమీకరించడం ఈ విజయాల్లో ప్రధానమైనది. నార్వెస్ట్ క్యాపిటల్ కొత్త పెట్టుబడిదారుగా సంస్థలో చేరింది. 2015 నుంచి భాగస్వామిగా ఉన్న మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్ మరోసారి పెట్టుబడి పెట్టింది. ప్రమోటర్ కూడా రూ.49.49 కోట్లను సమకూర్చారు. ఈ పెట్టుబడుల ఫలితంగా సంస్థ నికర విలువ రూ.988.51 కోట్ల నుంచి రూ.1,895.59 కోట్లకు పెరిగింది. మూలధన సమృద్ధి నిష్పత్తి (సీఆర్ఏఆర్) 20.86 శాతం నుంచి 27.34 శాతానికి చేరింది. భారతీయ రిజర్వు బ్యాంకు నిర్దేశించిన 15 శాతం కనీస పరిమితితో పోలిస్తే ఇది గణనీయంగా అధికం. మరోవైపు టర్మ్ రుణాలు, నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్, సెక్యూరిటైజేషన్ మార్గాల ద్వారా ఏడాదిలో రూ.2,722 కోట్ల నిధులను సమీకరించింది. ఈ మొత్తం సంస్థ ఈక్విటీతో పోలిస్తే 143.60 శాతానికి సమానం. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్లు సహా 65కు పైగా రుణదాతలతో సంస్థకు సంబంధాలు ఉన్నాయి. ఒకే నిధుల వనరుపై ఆధారపడకుండా విభిన్న మార్గాల ద్వారా మూలధనాన్ని సమకూర్చుకోవడం సంస్థ ఆర్థిక స్థిరత్వానికి బలాన్నిస్తోంది. విస్తరణకు అవసరమైన నిధులను సమర్థంగా సమీకరించడంతో పాటు రుణ కార్యకలాపాలకు అవసరమైన ఆర్థిక భద్రతను పెంచుకోవడంలో ఐకేఎఫ్ సాధించిన పురోగతిని ఈ రెండు పురస్కారాలు ప్రతిబింబిస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ, పెట్టుబడిదారుల విశ్వాసం, బలమైన మూలధన పునాది సంస్థ ఎదుగుదలకు ప్రధాన ఆధారాలుగా నిలుస్తున్నాయి.

• ఉద్యోగులే సంస్థకు చోదకశక్తి.. శిక్షణ, ప్రోత్సాహకాలకు అవార్డులు

మానవ వనరుల విభాగంలో ఐకేఎఫ్ ఫైనాన్స్‌కు రెండు జాతీయ పురస్కారాలు దక్కాయి. క్షేత్రస్థాయి సేల్స్, వసూళ్ల సిబ్బందికి అందిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఉత్తమ శిక్షణ కంటెంట్ అవార్డు లభించింది. తొలిసారి అధికారిక రుణం తీసుకునే వినియోగదారులకు వివిధ రుణ పథకాల వివరాలను సులభంగా వివరించేలా 'ప్రొడక్ట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్'ను రూపొందించారు. ఉద్యోగులు తక్కువ సమయంలో ఉత్పత్తులపై పూర్తి అవగాహన పొందేలా శిక్షణను చిన్న చిన్న మాడ్యూళ్లుగా విభజించారు. ప్రతి నెలా వర్చువల్ తరగతుల ద్వారా అన్ని శాఖల సిబ్బందికి ఒకే విధమైన సమాచారం అందిస్తున్నారు. ఈ విధానం వల్ల శిక్షణ పొందిన ఉద్యోగుల ఉత్పాదకత సగటున 45 శాతం పెరిగింది. ఉద్యోగుల పనితీరును గుర్తించి ప్రోత్సహించే విధానాలకు కూడా సంస్థ ప్రాధాన్యం ఇచ్చింది. 2025 ఆగస్టులో ప్రారంభించిన 'జెమ్' (గోయింగ్ ది ఎక్స్‌ట్రా మైల్) నెలవారీ రివార్డుల కార్యక్రమం, 'ఎఫ్‌టీఏ' ఫాస్ట్‌ట్రాక్ కెరీర్ ప్రోగ్రెషన్ పథకాలకు ఉత్తమ ఉద్యోగి గుర్తింపు పురస్కారం లభించింది. జెమ్ కార్యక్రమం కింద ఇప్పటివరకు సంస్థలోని 25 శాతం మంది ఉద్యోగులు, 138 శాఖల సిబ్బంది అవార్డులు అందుకున్నారు. ప్రతిభావంతులైన క్షేత్రస్థాయి ఉద్యోగులకు వేగంగా ఎదిగే అవకాశాలు కల్పించేందుకు ఎఫ్‌టీఏ పథకాన్ని అమలు చేస్తున్నారు. సాధారణంగా పదోన్నతి, వేతన పెంపునకు అవసరమైన కాలవ్యవధిని 12 నెలల నుంచి తొమ్మిది నెలలకు తగ్గించారు. మెరుగైన పనితీరు చూపించే ఉద్యోగులకు త్వరితగతిన గుర్తింపు, కెరీర్ పురోగతి కల్పించడం ద్వారా సంస్థలో ఉద్యోగుల భాగస్వామ్యాన్ని పెంచారు. ఈ చర్యల ఫలితంగా ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగుల రాజీనామాలు 37 శాతం తగ్గాయి. ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడం, వారి కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం, సంస్థతో దీర్ఘకాలిక అనుబంధాన్ని పెంపొందించడం వంటి అంశాల్లో ఐకేఎఫ్ అనుసరిస్తున్న విధానాలకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయి. ఉద్యోగుల అభివృద్ధిని సంస్థ అభివృద్ధిలో భాగంగా చూడటం ఈ విజయానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

• రిస్క్ నియంత్రణ విధానం.. పోర్ట్‌ఫోలియో వృద్ధితోనూ అదుపులో బకాయిలు

ఐదో పురస్కారం రిస్క్, కంప్లయన్స్ విభాగంలో ఉత్తమ పీపుల్ రిస్క్ నిర్వహణకు లభించింది. సంస్థలో బాధ్యతలను స్పష్టంగా నిర్ణయించేందుకు 'వెర్టికలైజేషన్ విత్ అకౌంటబిలిటీ' విధానాన్ని ప్రవేశపెట్టింది. గతంలో ప్రాంతాల వారీగా కార్యకలాపాలు నిర్వహించే విధానం నుంచి ఉత్పత్తుల ఆధారంగా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసే విధానానికి మారింది. కార్లు, వాణిజ్య వాహనాలు, చిన్న, తేలికపాటి వాణిజ్య వాహనాలు, నిర్మాణ యంత్రాలు, ఎంఎస్ఎంఈ రుణాల కోసం ఐదు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసింది. అదేవిధంగా రుణ బకాయిల దశను బట్టి రెండు ప్రత్యేక వసూళ్ల విభాగాలను ఏర్పాటు చేసింది. రుణ దరఖాస్తు పరిశీలన నుంచి మంజూరు, చెల్లింపుల పర్యవేక్షణ, చివరకు రుణ ముగింపు వరకు ప్రతి దశలో ఎవరి బాధ్యత ఏమిటో స్పష్టంగా నిర్ణయించింది. అధికార పరిమితులను సాంకేతిక వ్యవస్థల ద్వారానే అమలు చేస్తోంది. దీంతో వ్యక్తిగత నిర్ణయాల వల్ల తలెత్తే పొరపాట్లకు అవకాశం తగ్గడంతో పాటు పర్యవేక్షణ మరింత పటిష్ఠమైంది. రుణాల సంఖ్య పెరిగినప్పటికీ నాణ్యతను కాపాడుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఏడాది కాలంలో సంస్థ రుణ పోర్ట్‌ఫోలియో 29.3 శాతం పెరిగినా స్థూల నిరర్థక ఆస్తులు (స్టేజ్ 3) కేవలం 2.52 శాతానికే పరిమితమయ్యాయి. వృద్ధితో పాటు రుణాల నాణ్యతను కాపాడుకోవడంలో సంస్థ సాధించిన సమతుల్యతకు ఇది నిదర్శనం. ఈ సందర్భంగా చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రఘురామ్ కొత్తమర్తి మాట్లాడుతూ, తమ వినియోగదారుల్లో ఎక్కువ మంది తొలిసారి అధికారిక రుణం తీసుకునే చిన్న రవాణా వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వ్యవస్థాపకులని తెలిపారు. వారికి సరైన రుణ పథకాన్ని సరైన విధంగా అందించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ గుర్తింపు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. చీఫ్ రిస్క్ ఆఫీసర్ చక్రపాణి గొల్లమూడి మాట్లాడుతూ, ఆర్థిక నిర్వహణ, మానవ వనరులు, రిస్క్ నియంత్రణ విభాగాల్లో ఒకేసారి గుర్తింపు రావడం సంస్థ సమతుల్య వృద్ధికి నిదర్శనమన్నారు. క్రమశిక్షణతో కూడిన విస్తరణ, పటిష్ఠమైన రిస్క్ నియంత్రణలు, ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి పెట్టడం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ ఐదు పురస్కారాలు 220 శాఖల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి చెందుతాయని స్పష్టం చేశారు.

• వసుమతి దేవి నాయకత్వంలో విజయవాడ నుంచి జాతీయ స్థాయికి ప్రస్థానం

ఐకేఎఫ్ ఫైనాన్స్ ప్రస్థానం 1991లో విజయవాడలో ప్రారంభమైంది. వి.జి.కె. ప్రసాద్ (పుప్పుటూరి గోపాల కిషన్ ప్రసాద్) ఈ సంస్థను స్థాపించారు. వాహన రుణాల రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన ఆయన ప్రస్తుతం వ్యవస్థాపక చైర్మన్‌గా సంస్థకు మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆయన పెద్ద కుమార్తె కోగంటి వసుమతి దేవి మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె నాయకత్వంలో ప్రాంతీయ స్థాయిలో ప్రారంభమైన సంస్థ జాతీయ స్థాయి ఎన్‌బీఎఫ్‌సీగా ఎదిగింది. సాఫ్ట్‌వేర్, ఐటీ రంగంలో అనుభవం ఉన్న వసుమతి దేవి సంస్థ సాంకేతిక కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వినియోగదారుల అవసరాలను గుర్తించడం, వారికి తగిన రుణ పథకాలను అందించడం, రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడం వంటి మార్పులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌బీఐ వద్ద నమోదైన, ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించని ఎన్‌బీఎఫ్‌సీగా ఐకేఎఫ్ ఫైనాన్స్ పనిచేస్తోంది. స్కేల్ బేస్డ్ రెగ్యులేషన్ నిబంధనల ప్రకారం మిడిల్ లేయర్ సంస్థగా గుర్తింపు పొందింది. దేశంలోని 12 రాష్ట్రాల్లో 220 శాఖల ద్వారా సేవలు అందిస్తోంది. వాణిజ్య వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు, నిర్మాణ యంత్రాలు, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు హామీతో కూడిన రుణాలను అందిస్తోంది. మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్, నార్వెస్ట్, క్రియేడర్ వంటి ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడి సంస్థల మద్దతు కూడా సంస్థకు ఉంది. బ్యాంకింగ్ సేవలు అందని లేదా పరిమితంగా అందుతున్న ప్రాంతాల్లోని చిన్న వ్యాపారులకు ఆర్థిక అవకాశాలు కల్పించడం సంస్థ ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. చిన్న రవాణా వ్యాపారులు, డ్రైవర్ల నుంచి వాహన యజమానులుగా ఎదుగుతున్నవారు, చిన్న కాంట్రాక్టర్లు, స్వయం ఉపాధి పొందే సూక్ష్మ వ్యవస్థాపకులు ప్రధాన వినియోగదారులుగా ఉన్నారు. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షకు పైగా రుణగ్రహీతలకు సేవలు అందిస్తోంది. బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్న వర్గాలకు అధికారిక ఆర్థిక సేవలను చేరువ చేయడం ద్వారా ఆర్థిక సమ్మిళితత్వానికి తోడ్పడుతోంది.

కస్టమర్ ఎదుగుదలే లక్ష్యం: మేనేజింగ్ డైరెక్టర్ కోగంటి వసుమతి దేవి



2026 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఐకేఎఫ్ ఫైనాన్స్ పలు రికార్డు ఫలితాలను నమోదు చేసింది. నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) 29.3 శాతం పెరిగి రూ.6,718 కోట్లకు చేరింది. పన్ను అనంతర లాభం 52.7 శాతం వృద్ధితో రూ.164.83 కోట్లకు చేరుకుంది. ఇండియా రేటింగ్స్ సంస్థ 'ఐఎన్‌డీ ఏఏ' స్టేబుల్ రేటింగ్‌ను ప్రకటించింది. సంస్థ చరిత్రలో తొలిసారిగా ఏఏ శ్రేణి రేటింగ్ సాధించడం విశేషం. మూలధన సమృద్ధి నిష్పత్తి 27.34 శాతంగా నమోదైంది. ఉద్యోగులందరి భాగస్వామ్యంతో 95 శాతం ట్రస్ట్ ఇండెక్స్ స్కోరు సాధించి 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' ధ్రువీకరణను కూడా పొందింది. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కోగంటి వసుమతి దేవి సంస్థ అనుసరిస్తున్న కస్టమర్ అభివృద్ధి విధానాన్ని వివరించారు. క్రాస్ సెల్లింగ్ అంటే ఇప్పటికే రుణం తీసుకున్న వినియోగదారుడికి మరో రుణ ఉత్పత్తిని విక్రయించడం మాత్రమే కాదని, ఆయన ఆర్థికంగా ఎదిగేందుకు మరో అవకాశం కల్పించడమే తమ ఉద్దేశమని చెప్పారు. కస్టమర్ గతంలో రుణ వాయిదాలు ఎలా చెల్లించారు? వివిధ సీజన్లలో ఆయన ఆదాయం ఎలా ఉంది? ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థల వద్ద తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారా? వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే తదుపరి రుణంపై నిర్ణయం తీసుకుంటామని వివరించారు. మూడేళ్ల క్రితం చిన్న వాణిజ్య వాహనం కొనుగోలు కోసం రుణం తీసుకున్న డ్రైవర్‌ను ఉదాహరణగా పేర్కొన్నారు. ఆయన క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటే ఆదాయం పెరుగుతుందని, ఆ సమయంలో మరో వాహనం, పెద్ద వాహనం లేదా వ్యాపార నిర్వహణకు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ రుణం అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. కేవలం క్రెడిట్ స్కోర్ ఆధారంగా రుణ పరిమితిని నిర్ణయించబోమని స్పష్టం చేశారు. వాహనం ద్వారా వచ్చే ఆదాయం, రవాణా చేసే సరుకు, ఇంధన ఖర్చులు, వ్యాపార సామర్థ్యం వంటి అంశాలను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. గత చెల్లింపుల తీరును బట్టి వినియోగదారుడికి ఎంత రుణం ఇవ్వవచ్చో నిర్ణయిస్తామని వివరించారు. కస్టమర్ అవసరాలను గుర్తించి, ఆయన వ్యాపారాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు ఆర్థిక చేయూత అందించడమే తమ విధానమని పేర్కొన్నారు. బలమైన మూలధనం, విభిన్న నిధుల వనరులు, సాంకేతిక ఆధారిత రిస్క్ నియంత్రణలు, అంకితభావంతో పనిచేసే ఉద్యోగుల సహకారంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల వ్యవస్థాపకులకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఐదు జాతీయ పురస్కారాలు సంస్థకు లభించిన గుర్తింపుతో పాటు వినియోగదారుల అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, బాధ్యతాయుతమైన ఆర్థిక వృద్ధి దిశగా సాగుతున్న ప్రయాణానికి మరో బలమైన ప్రోత్సాహంగా నిలిచాయి.





ఒకప్పుడు వైసీపీకి కంచుకోటగా పేరొందిన బద్వేల్‌లో ఇప్పుడు రాజకీయ చదరంగం రసవత్తరంగా మారింది. నాలుగు నెలల క్రితం టీడీపీ పగ్గాలు చేపట్టిన మంచూరు సూర్యనారాయణరెడ్డి.. స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసిరారు. 40 కౌన్సిలర్ స్థానాల్లో 36 టీడీపీ ఖాతాలోకి వెళ్లడం, 59 ఎంపీటీసీ స్థానాల్లో 57 ఏకగ్రీవం కావడం రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. అయితే ఈ విజయాల వెనుక ప్రజాబలమా? లేక కోట్ల రూపాయల బేరసారాలా? అంటూ వైసీపీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి సంచలన ఆరోపణలు గుప్పించారు. కౌన్సిలర్‌కు రూ.20–25 లక్షలు.. చైర్‌పర్సన్‌కు ఏకంగా రూ.6 కోట్ల ధర పలికిందన్న ఆయన వ్యాఖ్యలు బద్వేల్‌ను కుదిపేశాయి. దీనికి మంచూరు దీటుగా బదులిస్తూ.. ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలకే దూరమవుతానని సవాల్ విసిరారు. గోవిందరెడ్డికి ఎమ్మెల్యే దాసరి సుధ అండగా నిలవడంతో పోరు మరింత ముదిరింది. మరోవైపు మహేష్‌బాబు సినిమా 'బిజినెస్‌మెన్'లోని సూర్యభాయ్‌తో మంచూరును పోలుస్తూ ప్రత్యర్థులు కొత్త విమర్శలకు తెరలేపారు. అసలు ఈ ఏకగ్రీవాల వెనుక ఏముంది? రాజకీయ వ్యూహమా.. ఆర్థిక లావాదేవీలా? పాత ఆధిపత్యానికి కొత్త నాయకత్వం విసిరిన సవాల్ ఎటు దారితీయనుంది? బద్వేల్ రాజకీయాల్లో అసలు బిజినెస్ ఎవరిది?

రుజువులుంటే రాజకీయాలు వదిలేస్తా?

మంచూరు చుట్టూ వైసీపీ పొలిటికల్ బాంబ్

ఫ్యాక్షన్ గడ్డపై పొలిటికల్ హిట్ వికెట్

బద్వేల్‌లో బిజినెస్‌మెన్ సూర్యభాయ్

ఏకగ్రీవాల వెనుక కోట్లలో లావాదేవీలు

బద్వేల్ రాజకీయాలు ఇప్పుడు సరికొత్త మలుపు తిరుగుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుంటే, వైఎస్ఆర్‌సీపీ నేతల్లో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలో పరుసగా నమోదైన ఏకగ్రీవాలు రాజకీయ వివాదానికి కేంద్రబిందువయ్యాయి. సుమారు 25 ఏళ్లుగా బద్వేల్ రాజకీయాల్లో తమదే ఆధిపత్యమని చెప్పుకుంటున్న వైసీపీకి తాజా పరిణామాలు రాజకీయంగా సవాల్ విసురుతున్నాయి. మరోవైపు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంచూరు సూర్యనారాయణరెడ్డి బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలల్లోనే స్థానిక ఎన్నికల్లో కూటమికి అనుకూల ఫలితాలు రావడం ఆయనకు కొత్త రాజకీయ బలాన్ని ఇచ్చింది. అయితే ఈ విజయాల వెనుక ఉన్న అసలు కథ ఏమిటన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ప్రజాబలంతో విజయాలు సాధించారా? రాజకీయ వ్యూహాలతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టారా? లేక పదవుల కోసం భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగాయా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. వైసీపీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి చేసిన ఆరోపణలు ఈ చర్చను మరింత వేడెక్కించాయి. స్థానిక సంస్థల పదవులకు ధరలు నిర్ణయించి విక్రయించారంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కౌన్సిలర్ పదవికి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు, చైర్‌పర్సన్ పదవికి ఏకంగా రూ.6 కోట్ల వరకు ధర పలికిందని ఆరోపించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ పదవుల విషయంలోనూ లక్షల రూపాయల లావాదేవీలు జరిగాయని పేర్కొన్నారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ ఇదే తరహా వ్యవహారాలు కొనసాగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలతో బద్వేల్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఒకవైపు ఏకగ్రీవాల విజయాన్ని కూటమి తన రాజకీయ బలంగా ప్రచారం చేసుకుంటుంటే, మరోవైపు వాటి వెనుక డబ్బు ప్రభావం ఉందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బద్వేల్‌లో ప్రజాస్వామ్య ఎన్నికలు జరిగాయా? రాజకీయ బేరసారాలు సడిచాయా? అన్న ప్రశ్నలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యాయి.

మంచూరు విజయంపై వైసీపీ గురి

మంచూరు సూర్యనారాయణరెడ్డి టీడీపీ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టి కేవలం నాలుగు నెలలే కావడం ఈ రాజకీయ పరిణామాల్లో కీలక అంశంగా కనిపిస్తోంది. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పట్టు సాధించలేదన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి అనుకూల ఫలితాలు రావడం ఆయనకు అనూహ్యమైన రాజకీయ అవకాశాన్ని కల్పించింది. బద్వేల్ మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ గణనీయమైన ఆధిపత్యం ప్రదర్శించింది. చైర్మన్ పదవి టీడీపీకి దక్కగా, మొత్తం 40 కౌన్సిలర్ స్థానాల్లో 36 స్థానాలను టీడీపీ గెలుచుకుంది. జనసేనకు రెండు, స్వతంత్ర అభ్యర్థులకు మరో రెండు స్థానాలు దక్కాయి. ఎంపీటీసీ ఎన్నికల్లోనూ మొత్తం 59 స్థానాలకు గాను 57 ఏకగ్రీవాలు కావడం రాజకీయంగా ఆసక్తి రేపింది. మిగిలిన రెండు స్థానాలకు మాత్రమే పోలింగ్ జరిగింది. జడ్పీటీసీ స్థానాల్లోనూ కూటమి ఆధిపత్యం కొనసాగినట్లు జిల్లా స్థాయి ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలనే wwమంచూరు తన నాయకత్వానికి లభించిన ప్రజా మద్దతుగా భావిస్తున్నట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. అయితే గోవిందరెడ్డి మాత్రం ఈ విజయాల వెనుక భారీగా డబ్బు చేతులు మారిందని ఆరోపిస్తున్నారు. మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి కుటుంబాన్ని కూడా తన వ్యాఖ్యల్లో ప్రస్తావించారు. ఆ కుటుంబానికి మంచూరు వెన్నుపోటు పొడిచారని, డబ్బు ఖర్చు చేసి టీడీపీ ఇన్‌చార్జి పదవి సంపాదించుకున్నారని విమర్శించారు. ఎన్నికల్లో అదే ఆర్థిక బలాన్ని ఉపయోగించి కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని ఆరోపించారు. స్థానిక పదవులకు ఒక్కో ధర నిర్ణయించి విక్రయించారన్నది ఆయన ప్రధాన విమర్శ. ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీ జెండా మోస్తున్న పాత నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా కీలక స్థానంలో ఉన్న సీనియర్ నేత ఒకరు పదవుల ధరలను నిర్దిష్టంగా ప్రస్తావించడం మాత్రం బద్వేల్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. గతంలో తమ పార్టీకి ఉన్న ఆధిపత్యం ఇప్పుడు ఎందుకు తగ్గిందన్న ప్రశ్న వైసీపీ శ్రేణుల్లోనూ వినిపిస్తోంది.

నిరూపిస్తే రాజకీయాలకే దూరం

గోవిందరెడ్డి ఆరోపణలకు మంచూరు సూర్యనారాయణరెడ్డి ఘాటుగా స్పందించారు. తనపై చేసిన విమర్శలను నిరాధారమైనవిగా కొట్టిపారేస్తూ, పదవులను అమ్ముకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని బహిరంగ సవాల్ విసిరారు. తాను డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లో కొనసాగుతున్నానని తన వైఖరిని వెల్లడించారు. బిజివేముల కుటుంబం పట్ల తనకు ఇప్పటికీ గౌరవం, కృతజ్ఞతాభావం ఉన్నాయని చెప్పారు. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే మాజీ ఎమ్మెల్యే విజయమ్మ లేదా రితేష్‌రెడ్డి వద్ద పనిచేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ద్వారా పార్టీ పాత నాయకత్వంతో తనకు విభేదాలు లేవని చెప్పే ప్రయత్నం చేశారు. అయితే అదే సమయంలో గోవిందరెడ్డిపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఉన్నతాధికారిగా పనిచేసిన గోవిందరెడ్డి బల్ల కింద చేతులు పెట్టే రకమంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఇద్దరు నేతల మధ్య ఉన్న రాజకీయ విభేదాలను వ్యక్తిగత విమర్శల స్థాయికి తీసుకెళ్లాయి. ఒకప్పుడు అధికార వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తన వ్యవహార శైలిని ఎలా కొనసాగించారన్న అంశాన్ని మంచూరు ప్రస్తావించడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. అయితే ఈ మాటల యుద్ధం మధ్య అసలు ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఏకగ్రీవాలు ఎక్కువగా నమోదైనంత మాత్రాన అక్రమాలు జరిగినట్లు నిర్ధారించలేం. అదే సమయంలో భారీ సంఖ్యలో ఏకగ్రీవాలు జరిగాయనే కారణంతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగిందని కూడా ముందుగానే నిర్ధయించలేం. అభ్యర్థుల పోటీ నుంచి తప్పుకోవడానికి స్థానిక రాజకీయ ఒప్పందాలు, పార్టీల మధ్య అవగాహనలు, వ్యక్తిగత సంబంధాలు, ఎన్నికల ఖర్చులు, ఇతర ప్రభావాలు కారణమై ఉండవచ్చు. బద్వేల్‌లో వీటిలో ఏ అంశం ప్రధాన పాత్ర పోషించిందన్నది స్పష్టత రావాల్సిన విషయం. నామినేషన్ల దాఖలు, ఉపసంహరణల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు, పోటీ నుంచి తప్పుకున్న అభ్యర్థుల వాదనలు, ఎన్నికల అధికారుల వద్ద నమోదైన వివరాలు పరిశీలించాల్సిన అవసరం ఉంది. గోవిందరెడ్డి ఆరోపణలు చేసినంత మాత్రాన అవి నిజాలు కావు. మంచూరు సవాల్ విసిరినంత మాత్రాన అవి అసత్యాలుగా తేలిపోవు. ఆరోపణలకు ఆధారాలు, సమాధానాలకు పారదర్శకతే అసలైన గీటురాళ్లు కావాలి.

గోవిందరెడ్డికి ఎమ్మెల్యే సుధ అండ


ఈ వివాదంలో వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ జోక్యం చేసుకోవడం మరో కీలక రాజకీయ పరిణామంగా మారింది. గోవిందరెడ్డి వ్యక్తిత్వాన్ని ఆమె బహిరంగంగా సమర్థించారు. బద్వేల్‌లో గత 25 ఏళ్లుగా కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా ఆయన ప్రజలకు సేవ చేశారని పేర్కొన్నారు. టీడీపీ నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో గోవిందరెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఒకసారి ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన ఆయన నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందారని చెప్పారు. గతంలో ఆయన నాయకత్వంలోనే వైసీపీ అభ్యర్థులు వరుస విజయాలు సాధించారని గుర్తుచేశారు. 2019 నుంచి 2024 మధ్య బద్వేల్ నియోజకవర్గంలో సుమారు రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆమె వెల్లడించారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధినే లక్ష్యంగా గోవిందరెడ్డి పని చేశారని సమర్థించారు. గత 25 ఏళ్లలో ఏ ప్రతిపక్ష నాయకుడినైనా ఆయన ఇబ్బందులకు గురిచేశారా? ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారా? అని ప్రశ్నించారు. ఉన్నతాధికారిగా పనిచేసిన అనుభవంతో రాజకీయాల్లోకి వచ్చిన గోవిందరెడ్డి తన హుందాతనాన్ని కొనసాగించారని, ప్రభుత్వ అధికారులను కించపరిచే విధంగా వ్యవహరించిన చరిత్ర లేదని పేర్కొన్నారు. అయితే ఎమ్మెల్యే సుధ చేసిన వ్యాఖ్యల్లో కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలు కూడా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆమె ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. బద్వేల్ వైసీపీకి కంచుకోట అని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగితే తమ పార్టీ అభ్యర్థుల విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. అప్పుడు ఎవరి రాజకీయ బలమెంతో ప్రజలే తేలుస్తారని వ్యాఖ్యానించారు.



పంచాయతీ ఎన్నికలే అసలు పరీక్ష

మొత్తంగా బద్వేల్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాలు ఇద్దరు నేతల మధ్య వ్యక్తిగత మాటల యుద్ధాన్ని మించి నియోజకవర్గ ఆధిపత్య పోరుగా మారాయి. ఒకవైపు 25 ఏళ్ల రాజకీయ చరిత్రను ప్రస్తావిస్తూ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ వైసీపీ పాత నాయకత్వాన్ని సమర్థిస్తున్నారు. మరోవైపు నాలుగు నెలల క్రితం టీడీపీ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన మంచూరు సూర్యనారాయణరెడ్డి స్థానిక ఎన్నికల ఫలితాలను తన నాయకత్వానికి లభించిన గుర్తింపుగా చూపిస్తున్నారు. పాత నాయకత్వం ప్రజాబలాన్ని ప్రస్తావిస్తుంటే, కొత్త నాయకత్వం ఎన్నికల ఫలితాలను ముందుకు తెస్తోంది. అయితే ఈ రెండు వాదనల్లోనూ ప్రజలకు సమాధానం కావాల్సిన ప్రశ్నలు అనేకం ఉన్నాయి. గోవిందరెడ్డి ఆరోపించినట్లుగా కౌన్సిలర్, చైర్‌పర్సన్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులకు కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయంటే వాటికి సంబంధించిన ఆధారాలు బయటపడాలి. మంచూరు విసిరిన సవాల్‌కు అనుగుణంగా తన రాజకీయ వ్యవహారాల్లో పారదర్శకతను నిరూపించుకోవాల్సిన బాధ్యత కూడా ఉంది. బిజివేముల కుటుంబానికి వెన్నుపోటు పొడిచారన్న ఆరోపణపై సంబంధిత వర్గాలు తమ వాదనలు వెల్లడించాలి. ఎమ్మెల్యే సుధ చెబుతున్న రూ.400 కోట్ల అభివృద్ధి పనుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారన్న విమర్శలపై కూడా స్పష్టత రావాలి. ఎన్నికల అధికారులు నామినేషన్లు, ఉపసంహరణలు, ఏకగ్రీవాల ప్రక్రియకు సంబంధించిన వివరాలను పారదర్శకంగా వెల్లడిస్తే అనేక అనుమానాలకు సమాధానం లభించే అవకాశం ఉంది. రాబోయే పంచాయతీ ఎన్నికలు ఈ రాజకీయ ఆధిపత్య పోరులో కీలక ఘట్టంగా మారనున్నాయి. ఆ ఎన్నికల్లో ఎవరు ఎంత ప్రజా మద్దతు సంపాదించగలరన్నది స్పష్టమవుతుంది. అయితే ఎన్నికల ఫలితాలతో పాటు ప్రస్తుత ఆరోపణలపై ఆధారాలతో కూడిన స్పష్టత రావడం కూడా అవసరం. బద్వేల్‌లో మంచూరు రాకతో రాజకీయ సమీకరణాలు మారాయా? వైసీపీ పాత ఆధిపత్యానికి కొత్త సవాల్ ఎదురైందా? అన్న ప్రశ్నలకు రాబోయే రోజుల్లో సమాధానం దొరకవచ్చు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం కంటే ప్రజలకు వాస్తవాలు చెప్పడం నేతలకు అవసరం. బిజినెస్‌మెన్ సూర్యభాయ్ అనే రాజకీయ విమర్శ నిజమా? లేక ప్రత్యర్థుల ప్రచార అస్త్రమా? అన్నది ఆరోపణలతో తేలే విషయం కాదు. ఆధారాలు, పారదర్శక ఎన్నికల ప్రక్రియ, ప్రజల తీర్పుతోనే స్పష్టమవుతుంది. అప్పటివరకు బద్వేల్ రాజకీయాల్లో ఏకగ్రీవాల చుట్టూ సాగుతున్న ఈ బిజినెస్‌మెన్ సూర్యభాయ్ వివాదం చర్చనీయాంశంగానే కొనసాగనుంది.

సూర్యభాయ్ పేరుతో కొత్త వివాదం



బద్వేల్ రాజకీయాల్లో మరో వైసీపీ నేత చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి సినిమా రంగు పులిమాయి. ఇటీవల ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజల ఓట్లతో ఎన్నికైనవారికి, రాజకీయ బేరసారాలతో ఎంపికైనవారికి తేడా ఉందంటూ విమర్శించారు. గత మూడు నాలుగు రోజులుగా కొత్త ప్రజాప్రతినిధులు చేస్తున్న వ్యాఖ్యలు వింటుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. 25 ఏళ్లుగా సాధించలేని విజయాన్ని ఇప్పుడు సాధించామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో 2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని గుర్తుచేశారు. అప్పట్లో సర్పంచ్ నుంచి వార్డు సభ్యుడి వరకు అన్ని స్థాయిల్లో పోటీలు జరిగేవని, ప్రజలకు తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకునే అవకాశం ఉండేదని చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంతో తమకు పోటీ లేదని, వైసీపీకి ఉన్న ప్రజాబలం ముందు కూటమి నిలబడలేదని వ్యాఖ్యానించారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగి ఉంటే ప్రతి స్థానంలోనూ తమ పార్టీ అభ్యర్థులు గెలిచేవారని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మహేష్‌బాబు నటించిన 'బిజినెస్‌మెన్' సినిమాలోని సూర్యభాయ్ పాత్రను ప్రస్తావించడం రాజకీయ చర్చకు కొత్త కోణాన్ని జోడించింది. సినిమాలో సూర్యభాయ్ వ్యవస్థలను తనకు అనుకూలంగా మలుచుకున్నట్లుగా బద్వేల్‌లోనూ ఒక బిజినెస్ ప్రారంభమైందని ఆరోపించారు. ప్రజాప్రతినిధులను డబ్బులతో మేనేజ్ చేసి ఎంపిక చేసుకున్నారంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలు మంచూరు సూర్యనారాయణరెడ్డిని లక్ష్యంగా చేసుకున్నవేనన్న చర్చ స్థానికంగా సాగుతోంది. దీంతో బద్వేల్ రాజకీయాల్లో బిజినెస్‌మెన్ సూర్యభాయ్ అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. అయితే సినిమా పాత్రతో పోల్చడం రాజకీయ విమర్శ మాత్రమే. అది ఎలాంటి ఆరోపణకూ ఆధారం కాదు. పదవుల కోసం డబ్బులు చేతులు మారాయని చెబుతున్నవారు లావాదేవీల వివరాలు, సంబంధిత వ్యక్తులు, ఇతర ఆధారాలను బయటపెట్టాలి. అలాగే అధికారంలో ఉన్నవారు ఎన్నికల ప్రక్రియపై వస్తున్న అనుమానాలకు సమాధానం చెప్పాలి. ఏకగ్రీవాల వెనుక నిజంగా రాజకీయ ఒప్పందాలు ఉన్నాయా? అభ్యర్థులు స్వచ్ఛందంగా తప్పుకున్నారా? లేక ఒత్తిళ్లు పని చేశాయా? అన్న అంశాలు పరిశీలనకు రావాలి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఉండటం అత్యంత ముఖ్యం. అందుకే ఈ వివాదాన్ని కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.



సిరాజ్ బెంచ్‌కే పరిమితం!


డ్రింక్స్ మోస్తే టెస్టులకు సిద్ధమైనట్టేనా?
గంభీర్ వ్యూహంపై ఆకాశ్ చోప్రా ఆగ్రహం

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో భారత్ ఘోరంగా 89 పరుగులకే కుప్పకూలిన వేళ.. జట్టు ఎంపికపై మరో వివాదం తెరపైకి వచ్చింది. టెస్టు జట్టులో ఉన్న స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు వన్డే సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ అవకాశం ఇవ్వకపోవడంపై మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అటు టెస్టుల కోసం సిద్ధం కావాల్సిన సిరాజ్‌ను జట్టులోనే ఉంచి, ఇటు మైదానంలో ఆడించకుండా డ్రింక్స్ మోయించడం ఏమిటని ప్రశ్నించాడు. అన్షుల్ కాంబోజ్‌ను టెస్టు సన్నాహాల కోసం పంపినప్పుడు సిరాజ్‌ను మాత్రం ఎందుకు పక్కన పెట్టారని నిలదీశాడు. గత 35 నెలల్లో కేవలం 10 మ్యాచ్‌లు, 24 నెలల్లో ఏడు మ్యాచ్‌లు, ఏడాదిలో నాలుగు మ్యాచ్‌లే ఆడించిన తీరు సరికాదని విమర్శించాడు. మరోవైపు సునీల్ గవాస్కర్ మాత్రం 2027 వన్డే ప్రపంచకప్ గురించి ఇప్పుడే ఆలోచించకుండా, ప్రస్తుత సిరీస్ గెలుపుపైనే దృష్టి పెట్టాలని సూచించాడు. దక్షిణాఫ్రికా పర్యటనకు ఇంకా సమయం ఉందని, జట్టును అనవసరంగా మార్చకూడదని అభిప్రాయపడ్డాడు. మొత్తానికి సిరాజ్ ప్రతిభకు అవకాశమేది? టెస్టు సన్నాహాల పేరుతో బెంచ్‌కే పరిమితం చేయడమెందుకు? అన్నప్రశ్నలు భారత క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



ఆఖరి బంతికి అద్భుతం
భారత్‌దే ఆసియా కిరీటం!





దాదాపు ఓటమి అంచు నుంచి అద్భుత విజయానికి.. చివరి వికెట్లు చేతిలో ఉండగా అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ భారత యువ క్రికెటర్లు చరిత్ర సృష్టించారు. అండర్19 ఆసియా కప్ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై భారత్ ఒక్క వికెట్ తేడాతో సంచలన విజయం సాధించి తొమ్మిదోసారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. 338 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఒక దశలో 252 పరుగులకే ఏనిమిది వికెట్లు కోల్పోయి ఓటమి అంచుకు చేరుకుంది. ఇక విజయం పాకిస్తాన్‌దేనని భావిస్తున్న తరుణంలో మనాల్ చౌహాన్, మోహిత్ ఉల్వా భారత శిబిరంలో కొత్త ఆశలు నింపారు. మనాల్ 32 బంతుల్లో 47 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, మోహిత్ కేవలం 26 బంతుల్లోనే అజేయంగా 49 పరుగులు బాది ప్రత్యర్థి ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి బంతి వరకు ఉత్కంఠ రేపిన పోరులో భారత్ విజయలక్ష్యాన్ని ఛేదించి సంబరాల్లో మునిగింది. అంతకుముందు పాకిస్తాన్ ఉస్మాన్ ఖాన్ (107), అబ్దుల్ ఖాదిర్ (80), కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్ (63) రాణించడంతో 337/9 పరుగులు చేసింది. భారత బౌలర్లలో కావ్య పటేల్ నాలుగు వికెట్లు, సి. వెంకట మూడు వికెట్లతో సత్తా చాటారు. చివరి ఆరు ఓవర్లలో ఆరు వికెట్లు పడగొట్టి పాక్‌ను కట్టడి చేశారు. గ్రూప్ దశ ఓటమికి ఫైనల్లో ప్రతీకారం తీర్చుకున్న యువ భారత్.. తొమ్మిదో ఆసియా కప్‌తో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటింది!

చివరి బంతికి సిక్సర్
హీరోగా మోహిత్ ఉల్వా!


భారత్‌కు అసాధ్యమనుకున్న విజయాన్ని అందించి రాత్రికి రాత్రే హీరోగా మారాడు 18 ఏళ్ల యువ సంచలనం మోహిత్ ఉల్వా! అండర్ 19 ఆసియా కప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి తన పేరును చరిత్రలో నిలిపాడు. పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ కష్టాల్లో పడిన వేళ, మరో 52 బంతుల్లో 86 పరుగులు చేయాల్సిన పరిస్థితిలో క్రీజులోకి వచ్చిన ఉల్వా మ్యాచ్ గమనాన్నే మార్చేశాడు. మనాల్ చౌహాన్‌తో కలిసి పాకిస్తాన్ బౌలింగ్‌పై ఎదురుదాడికి దిగాడు. కేవలం 26 బంతుల్లో ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో అజేయంగా 49 పరుగులు సాధించాడు. 188.46 స్ట్రైక్‌రేట్‌తో పరుగుల వరద పారించాడు. చివరి బంతిని



సిక్సర్‌గా మలిచి భారత్‌కు ఒక్క వికెట్ తేడాతో సంచలన విజయాన్ని అందించాడు. గుజరాత్‌లోని సౌరాష్ట్రకు చెందిన ఉల్వా 2007 నవంబరు 30న జన్మించాడు. గ్రామంలో టెన్నిస్ బాల్ క్రికెట్‌తో ఆట మొదలుపెట్టి, సౌరాష్ట్ర వయోపరిమితి జట్ల ద్వారా ఎదిగాడు. జామ్‌నగర్‌లోని క్రికెట్ బంగ్లా అకాడమీలో మహేంద్రసిన్హ్ చౌహాన్ వద్ద శిక్షణ పొందాడు. ఫైనల్లో ఎనిమిది ఓవర్లు బౌలింగ్ చేసి 57 పరుగులు ఇచ్చినా, బ్యాట్‌తో చేసిన విధ్వంసం అతడిని భారత విజయానికి అసలైన హీరోగా నిలిపింది!

టోర్నీ టాప్ ప్లేయర్‌గా
జూనియర్ సెహ్వాగ్

భారత క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ అండర్ 19 ఆసియా కప్ 2026లో సత్తా చాటాడు. అద్భుత బ్యాటింగ్‌తో పరుగుల వరద పారించి టోర్నమెంట్ అత్యుత్తమ ఆటగాడి (ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్) అవార్డును సొంతం చేసుకున్నాడు. ఐదు మ్యాచ్‌ల్లో ఏకంగా 361 పరుగులు సాధించి టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. 90.25 సగటుతో ప్రత్యర్థి బౌలర్లకు సవాల్ విసిరాడు. పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్లోనూ తన ప్రతిభను చాటుతూ 61 బంతుల్లో 58 పరుగులు చేసి భారత విజయానికి బలమైన పునాది వేశాడు. 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టు విజయం సాధిస్తుందన్న నమ్మకం తమకు మొదటి నుంచీ ఉందని ఆర్యవీర్ వెల్లడించాడు. వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా



ఉండటంతో సహజమైన ఆటతీరుతో ఆడితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చించుకున్నట్లు తెలిపాడు. చివరి పది ఓవర్లలో 100 నుంచి 120 పరుగులు సాధించే సామర్థ్యం తమ జట్టుకు ఉందని చెప్పాడు. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని ఇన్నింగ్స్‌ను చివరి వరకు నడిపించాడని ప్రశంసించాడు. చివర్లో మోహిత్ ఉల్వా, మనాల్ చౌహాన్ అద్భుత పోరాటం చేశారని కొనియాడాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్‌తో ఇంకా మాట్లాడలేదని, తర్వాత మాట్లాడతానని ఈ యువ సంచలనం చెప్పాడు. తండ్రి వారసత్వాన్ని గుర్తు చేస్తూ తనదైన ముద్ర వేసిన ఆర్యవీర్.. భారత క్రికెట్‌లో మరో ఆశాకిరణంగా నిలిచాడు.

ఆసియా కప్ విజేతలకు మోదీ అభినందనలు

అండర్ 19 ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత యువ క్రికెట్ జట్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆసియా కప్ సాధించడం భారత క్రికెట్‌కు అద్భుతమైన రోజని పేర్కొన్నారు. టోర్నీ అంతటా యువ ఆటగాళ్లు కనబరిచిన ప్రతిభ, చివరి బంతి వరకు పోరాడిన తీరు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ విజయం దేశంలోని మరెందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. భవిష్యత్తులోనూ భారత యువ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

భారత యువ జట్టుకు చంద్రబాబు అభినందనలు

పురుషుల అండర్19 ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన టీమిండియాపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసలు కురిపించారు. పాకిస్తాన్‌పై చివరి బంతికి సంచలన విజయం సాధించడం చరిత్రాత్మకమైన, అద్భుతమైన క్షణమని ఎక్స్ వేదికగా కొనియాడారు. పాకిస్తాన్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత యువ ఆటగాళ్లు అసాధారణ సంయమనం, సమష్టి కృషిని ప్రదర్శించారని ప్రశంసించారు.

ఆసియా కప్ విజేతలకు జగన్ అభినందనలు

పురుషుల అండర్19 ఆసియా కప్ విజేతగా నిలిచి దేశానికి గర్వకారణంగా మారిన భారత జట్టుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పాకిస్తాన్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో 338 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడం అసాధారణమని పేర్కొన్నారు. కీలక దశల్లో వికెట్లు కోల్పోయినా యువ క్రికెటర్లు సంయమనం కోల్పోకుండా చివరి వరకు పోరాడారని ప్రశంసించారు. ముఖ్యంగా చివరి ఓవర్లలో మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వా అందించిన కీలక పరుగులు జట్టుకు ఒక వికెట్ తేడాతో విజయాన్ని అందించాయని కొనియాడారు.

చిన్న బడ్జెట్.. భారీ వసూళ్లు!

- ₹ 23 కోట్లతో సూర్య 'సీన్' మూవీ
- ప్రపంచవ్యాప్తంగా ₹ 200 కోట్ల కలెక్షన్
- ప్రపంచానికి కంటెంట్ పవర్ చాటిన సూర్య!



స్టార్ హీరో అంటే వందల కోట్ల బడ్జెట్.. భారీ సెట్లు.. కళ్లు చెదిరే విజువల్స్ ఉండాల్సిందేనా? ఈ లెక్కలన్నింటినీ తిరగరాస్తూ బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనం సృష్టిస్తోంది సూర్య నటించిన 'సీన్' చిత్రం. భారీ ఖర్చులు లేకుండానే బాక్సాఫీస్‌ను ఏలవచ్చని ఈ సినిమా నిరూపిస్తోందంటూ సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. సూర్య సొంత నిర్మాణ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి కేవలం రూ.23 కోట్లు మాత్రమే ఖర్చయినట్లు విశ్వసనీయ సినీ వర్గాల సమాచారం. అయితే ఈ బడ్జెట్‌ను అధికారికంగా ధ్రువీకరించలేదు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రూ.200 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు నివేదికలు చెబుతున్నాయి. అంటే పెట్టిన పెట్టుబడితో పోలిస్తే వసూళ్ల స్థాయి అసాధారణంగా కనిపిస్తోంది. దీనికి తోడు శాటిలైట్, ఓటీటీ, మ్యూజిక్ హక్కుల ద్వారా వచ్చే ఆదాయం అదనం. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలంటే భారీ బడ్జెట్‌లు, హంగులు, ఆర్భాటాలే విజయానికి కొలమానాలుగా భావించే పరిస్థితుల్లో 'సీన్' మాత్రం కథాబలాన్నే ప్రధాన ఆయుధంగా మార్చుకుంది. అనవసరమైన విజువల్ హంగుల కంటే ఆసక్తికరమైన కథనం, వైవిధ్యమైన ప్రజెంటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ప్రేక్షకులను ఆకట్టుకున్నట్లు కనిపిస్తోంది. సినిమా విజయానికి కోట్ల రూపాయల ఖర్చు కాదు.. ప్రేక్షకుడిని కట్టిపడేసే కథే అసలైన పెట్టుబడి అని ఈ చిత్రం మరోసారి చర్చకు తెరలేపింది. పెద్ద హీరోలంతా భారీ బడ్జెట్ల వెంట పరుగులు తీయాల్సిన అవసరం లేదని, సరైన కథను ఎంచుకుంటే పరిమిత వ్యయంతోనూ భారీ విజయాలు సాధించవచ్చనే సందేశాన్ని 'సీన్' బాక్సాఫీస్ వేదికగా వినిపిస్తోంది. మొత్తానికి సూర్య సినిమా ఇప్పుడు వసూళ్లతో పాటు నిర్మాణ వ్యయంపై కూడా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.



రామాయణం ఓటీటీ హక్కులు అందుకే అమ్మలేదు

- అసలు విషయం చెప్పిన స్టార్ ప్రడ్యూసర్ దిల్ రాజు

'రామాయణం' సినిమాను ఇప్పటివరకు ఏ ఓటీటీ సంస్థకు విక్రయించలేదు.. శాటిలైట్ హక్కులు కూడా అమ్మలేదు.. ప్రేక్షకులు ప్రస్తుతం ఈ అద్భుత దృశ్యకావ్యాన్ని థియేటర్లలోనే చూడాలి.. అంటూ ప్రముఖ నిర్మాత దిల్ రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాధారణంగా పెద్ద సినిమాలు విడుదలకు ముందే ఓటీటీ హక్కులను విక్రయిస్తాయని, కానీ 'రామాయణం' విషయంలో నిర్మాతలు భిన్నమైన నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. ఈ సినిమాకు ఇప్పటివరకు ఎలాంటి ఓటీటీ భాగస్వామి లేరని, టెలివిజన్‌లో ప్రసారం చేసే ఒప్పందం కూడా జరగలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎప్పుడు ఓటీటీలోకి తీసుకురావాలన్నది పూర్తిగా నిర్మాతల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ద్వారా ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన దిల్ రాజు వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు రణబీర్ కపూర్, యష్ నటించిన నితేశ్ తివారీ దర్శకత్వ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.1,111 కోట్ల వసూళ్లతో దూసుకుపోతోంది. భారత్‌లో రూ.769.17 కోట్లు రాబట్టగా, నవంబర్ 14న ఒక్కరోజే రూ.31.08 కోట్ల వసూళ్లు సాధించింది. హిందీలో రూ.25.96 కోట్లు, కన్నడలో రూ.2.54 కోట్లు, తమిళంలో రూ.1.71 కోట్లు, తెలుగులో రూ.87 లక్షలు వసూలయ్యాయి. చైనా సహా ఇతర అంతర్జాతీయ మార్కెట్లలో విడుదలైతే వసూళ్లు మరింత పెరుగుతాయని దిల్ రాజు అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా రూ.1,800 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు వసూళ్లు సాధించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మొత్తానికి ఓటీటీ ఒప్పందం లేకుండానే థియేటర్లలో ప్రేక్షకుల ఆదరణతో దూసుకుపోతున్న 'రామాయణం' ఇప్పుడు బాక్సాఫీస్‌తో పాటు డిజిటల్ హక్కుల విషయంలోనూ హాట్ టాపిక్‌గా మారింది.

- ఎన్టీఆర్‌తో అనిల్ రావిపూడి
- నవ్వుల విందుకు రంగం సిద్ధం!
- మాస్ ఎన్టీఆర్.. కామెడీ కింగ్ అనిల్
- బాక్సాఫీస్ దగ్గర కొత్త సందడి!



టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్‌కు తెరలేచింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి చేతులు కలపడంతో అభిమానుల్లో కొత్త ఉత్సాహం మొదలైంది. తన తదుపరి సినిమాను అనిల్ రావిపూడితో చేయబోతున్నట్లు ఎన్టీఆర్ స్వయంగా ప్రకటించి సినీ ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. అనిల్‌తో కలిసి దిగిన ఫొటోను పంచుకుంటూ 'ఈసారి నవ్వుల జాతర ఖాయం' అనే అర్థం వచ్చేలా ఆసక్తిని పెంచారు. నందమూరి కళ్యాణ్ రామ్‌కు చెందిన ఎన్టీఆర్ ఆర్ట్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనుంది. ప్రస్తుతం వెంకటేశ్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో మల్టీస్టారర్ తెరకెక్కిస్తున్న అనిల్ రావిపూడి, ఆ సినిమా తర్వాత ఎన్టీఆర్ ప్రాజెక్టుపై దృష్టి పెట్టనున్నారు. ఇప్పటివరకు పవన్ కళ్యాణ్, మహేశ్ బాబులతో అనిల్ సినిమా చేయనున్నారంటూ ప్రచారం సాగినా, అనూహ్యంగా ఎన్టీఆర్‌తో కాంబినేషన్ అధికారికమైంది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' సినిమా చేస్తున్న ఎన్టీఆర్‌కు, అనిల్ చిత్రం చాలా కాలం తర్వాత పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా నిలవనుంది. గతంలో 'అదుర్స్'తో తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన తారక్, 'బాద్‌షా'లోనూ వినోదాన్ని పంచారు. ఇప్పుడు అనిల్ మార్క్ కామెడీ, ఎన్టీఆర్ ఎనర్జీ కలిస్తే వెండితెరపై నవ్వుల పండుగే అన్న అంచనాలు మొదలయ్యాయి. త్రివిక్రమ్‌తో అనుకున్న 'గాడ్ ఆఫ్ వార్' ప్రాజెక్టు ఇప్పట్లో పట్టాలెక్కే అవకాశాలు కనిపించడం లేదని సమాచారం. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ముందుగా అనిల్ రావిపూడి సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. మొత్తానికి మాస్ హీరోలోని కామెడీ కోణాన్ని మరోసారి వెండితెరపై చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



తెలుగు తెరపై విషాదం
నటశిఖరం గిరిబాబు కన్నుమూత!

600కు పైగా చిత్రాలతో చెరగని ముద్ర ఆరు దశాబ్దాల సినీ ప్రయాణానికి సెలవు!

తెలుగు చిత్రసీమలో మరో విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనతో ఆరు దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన సీనియర్ నటుడు, నిర్మాత, దర్శకుడు గిరిబాబు (80) కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శనివారం హైదరాబాద్‌లోని కొండాపూర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలో 1946 జూన్ 8న జన్మించిన గిరిబాబు, 'జగమే మాయ' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. అక్కడ మొదలైన ఆయన సినీ ప్రస్థానం ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. హీరోగా, ప్రతినాయకుడిగా, సహాయ నటుడిగా విభిన్న పాత్రల్లో తనదైన ముద్ర వేసి 600కు పైగా చిత్రాల్లో నటించారు. పాత్ర ఏదైనా అందులో పరకాయ ప్రవేశం చేయడం ఆయన ప్రత్యేకత. తెరపై ప్రతినాయకుడిగా ప్రేక్షకుల్లో భయం పుట్టించినా, మరో పాత్రలో సహజమైన నటనతో అభిమానులను ఆకట్టుకున్నారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా తెలుగు సినిమాకు సేవలందించారు. 'సింహ గర్జన', 'మెరుపుదాడి', 'ఇంద్రజిత్' వంటి చిత్రాలను నిర్మించగా, 'రణరంగం', 'ఇంద్రజిత్', 'నీ సుఖమే నే కోరుకున్నా' వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు. 2023లో విడుదలైన 'అన్ని మంచి శకునములే' ఆయన చివరి తెరపై కనిపించిన చిత్రంగా నిలిచింది. 2016లో భార్య అనారోగ్యంతో మరణించగా, ఆయనకు ఇద్దరు కుమారులు బోస్ బాబు, ప్రముఖ హాస్యనటుడు రఘుబాబు ఉన్నారు. గిరిబాబు మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం అలుముకుంది. దశాబ్దాల పాటు ఎన్నో తరాల ప్రేక్షకులను అలరించిన ఆయన పాత్రలు, సినిమాలు ఎప్పటికీ ప్రేక్షకుల జ్ఞాపకాల్లో నిలిచిపోనున్నాయి. వెండితెరపై ఆయన పోషించిన పాత్రలకు తెరపడినా, తెలుగు సినిమా చరిత్రలో ఆయన వేసిన ముద్ర మాత్రం చెరిగిపోదు.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.